ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

# ఏలూరు

జిల్లా వార్తలు

5

శనివారం 10 ఆగస్టు 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0

ట్రిపుల్ ఐటీలో రెండో విడత కౌన్సెలింగ్ 7



# వైసీపీకి బిగ్ షాక్

## ప్రత్యక్ష రాజకీయాలకు ఆళ్ల నాని గుడ్‌బై

- ఇప్పటికే పలువురు నేతల రాజీనామా
- సీనియర్లు లేక చతికిలపడిన వైసీపీ
- టీడీపీలోకి త్వరలో మేయర్, కౌన్సిలర్లు ?

**ఏలూరులో వైసీపీకి బిగ్ షాక్. ఆ పార్టీనే కొన్నేళ్లుగా అంటి పెట్టుకుని వీర విధేయనేతగా వ్యవహరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని వైసీపీ పదవులన్నింటికీ రాజీనామా చేశారు. ఇక ముందు ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనేదిలేదని ప్రకటించారు. దీంతో ఏలూరులో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యింది. ఇంతకుముందే ఏలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు రాజీనామా చేయగా, ఇంకొందరు అంటీముట్టనట్టుగా ఉన్నారు. ఇప్పుడు ఆళ్ల నాని నిష్క్రమణతో మరి కొంతమంది పక్క చూపులు చూడక తప్పేటట్టులేదు.**

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

అధికారంలో ఉన్నన్నాళ్లు తమకు తిరుగేలేదన్నట్టుగా అంతా వెలగబెట్టారు. అంతా తమ కనుసన్నల్లోనే సాగి తీరాలంటూ ఆంక్షలు పెట్టిమరీ శపథం నెరవేర్చుకున్నారు. తాను అవునంటే అవును, కాదంటే.. కాదు అన్నవారినే దగ్గరకు చేర్చుకున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని దూరంగా జరిపారు. పార్టీలో లేకుండా చేశారు. అంతలా గడిచిన ఐదేళ్లల్లోను వైసీపీలో రాజకీయాలు తారాస్థాయికి వెళ్లాయి. ఈ విషయంలో ఏలూరు నియోజకవర్గానికి సంబంధించి వైసీపీలో ఆళ్ల నాని ఏకఛత్రాధిపత్యం చేశారు. తాను చెప్పింది తూచా తప్పకుండా చేసే కొందరిని తనకు సన్నిహితంగా ఉంచుకున్నారు. ఆఖరుకు తాను ప్రయాణించే కాన్వాయ్‌లో సైతం ఎవరు ఏ స్థానంలో ఉండాలో కూడా నిర్దేశించే స్థాయికి ఎదిగారు. పైకి రాజకీయ వివాద రహితుడిగా పేరొందినా అంతర్గతంగా మాత్రం వైసీపీలో ఆయన చెప్పిందే వేదం అయ్యింది. ఎందుకనంటే.. ముఖ్యమంత్రిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి కొనసాగిన తరుణంలోను ఆళ్ల నాని అప్పట్లో ఆయనకు సన్నిహితులుగా ఉండేవారు. ఒక రకంగా చెప్పాలంటే వైఎస్సార్ కుటుంబానికి ఆళ్ల నాని ఆది నుంచి సన్నిహితుడు. ఆయన నుంచే కొంత రాజకీయం ఆరా తీసేవారు. విషయం బయట పడకుండా గుట్టుగా వ్యవహరించడం, వైఎస్ కుటుంబానికి విధేయుడుగా ఉండడం, తనకంటూ ప్రత్యేక స్థానం ఇచ్చేలా జాగ్రత్త పడడంలో నాని తనకు తానే నిరూపించుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజశేఖరరెడ్డి మరణానంతరం వైసీపీ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్‌ను వీడి జగన్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఆళ్ల నాని చెప్పిందే ఆ పార్టీలో అక్షర సత్యమైంది. వైసీపీలో నేతల మధ్య సమన్వయం, అంతర్గత కలహాలు తీర్చడం, పార్టీ ఆదేశాలను చక్కబెట్టడంలో ఆయనకు జగన్ వద్ద మంచి మార్కులు లభించాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో నాని ఓటమి చెందారు. అప్పటికే ఆయన వరుసగా రెండుసార్లు ఏలూరు అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికయ్యారు. దీంతో నానిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో పాటు ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. అప్పటి నుంచి పార్టీ వ్యవహారాల్లో చురుకైన పాత్ర వహిస్తూ వచ్చారు. 2019 ఎన్నికల్లో ఏలూరు నుంచి మూడోసారి ఎన్నికైన ఆయనను జగన్ తన మంత్రి వర్గంలో వైద్యఆరోగ్యశాఖతోపాటు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు. ఆ తర్వాత మంత్రి పదవి నుంచి తప్పుకున్నా ఏలూరులో ఆయన పట్టు సడలకుండా పార్టీ అధ్యక్ష హోదాలోనే కీలకంగా వ్యవహరించారు.

**వైసీపీ ఖాళీ..**

ఇక ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనబోనని ఏలూరు సీనియర్ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని నిష్క్రమించడంతో ఆ పార్టీ ఖాళీ అయినట్టయ్యింది. ఎన్నికల ముందే నాని వ్యవహార శైలి నచ్చక పార్టీ సీనియర్ నేత ఏలూరు నగరంలో కీలకంగా ఉండే ఎంఆర్‌డీ బలరాం, ఆయన సతీమణి ఈశ్వరి జంటగా వైసీపీ నుంచి నిష్క్రమించారు. అప్పట్లో టీడీపీ పక్షాన బడేటి చంటికి పూర్తి మద్దతు ప్రకటించి ఆ పార్టీలో చేరారు. తన సతీమణి ఈశ్వరికి రెండోసారి కూడా ఈడా చైర్మన్‌గా కొనసాగించాలని కోరినా నాని తిరస్కరించడంతో ఎంఆర్‌డీ కుటుంబం నానిపై అసంతృప్తి ప్రకటించి టీడీపీలో చేరారు. ఆ తదుపరి ఎన్నికలకు ముందు, ఆ తర్వాత ఏలూరు నగర వైసీపీ కార్పొరేటర్లు కొందరు నానిని కాదని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎందుకిలా జరుగుతుందో వైసీపీ పట్టించుకోలేదు, అంతకంటే మించి నాని కూడా ఎవరుపోతే నాకేంటన్నట్టుగా మిన్నకుండిపోయారు. వైసీపీ ఓటమి అనంతరం తమ భవిష్యత్ ఏమిటో తెలియక విలవిలలాడుతున్న ఏలూరు వైసీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వీరిద్దరు సుదీర్ఘ కాలం పాటు ఆళ్ల నానికి అత్యంత సన్నిహితులు. దీంతో వైసీపీకి పడిన గండి మళ్లీ పూడ్చకముందే ఏకంగా ఈసారి పార్టీలో అన్నీ తానై వ్యవహరిస్తున్న నానియే పార్టీ పదవులకు శుక్రవారం రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. వాస్తవానికి గడిచిన ఐదేళ్లల్లో వైసీపీలో ఆళ్ల నాని పక్షాన కొందరు అంతర్గతంగా, ఆయనకు వ్యతిరేకంగా మరికొందరు కొనసాగుతూ వచ్చారు. నాని వైఖరి కొందరికి అయిష్టంగా ఉన్నా ఎవరూ నోరు మెదపలేని పరిస్థితి. దీనికితోడు ఒకదశలో నానికి, అప్పటి ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు మధ్య విభేదాలు కొనసాగాయి. ఎంపీ వర్గాన్ని పక్కనపెట్టి మరీ నాని వర్గీయులు దూకుడుగా ముందుకు వెళ్లడం పార్టీలో రచ్చకెక్కింది. దీనికితోడు నాని వెంట ఉండే ప్రత్యేక కోటరి కొందరిని మాత్రమే అనుమతించి మరికొందరిని దూరంగా నెట్టేయడంలో కీలక పాత్ర పోషించింది. ఇలాంటి తరుణంలోనే ఏలూరు మేయర్ నూర్జహాన్, ఆమె భర్త పెదబాబు పార్టీ, నాని తీరుపై పూర్తి అసంతృప్తితో ఉండిపోయారు.

**వాట్ నెక్స్ట్..**

ఏలూరులో వైసీపీ ప్రత్యక్ష రాజకీయాల నుంచి ఆళ్ల నాని తప్పుకున్నట్టు ప్రకటించడంతో ఆయన స్థానంలో వైసీపీ ఇన్‌చార్జి పదవి ఎవరికి ఇస్తారనే దానిపైనే ఇప్పటికే ఆ పార్టీలో చర్చ ఆరంభమైంది. ఆళ్ల నాని నిర్ణయం పార్టీని పూర్తిగా ఖాళీ చేసేలా చేసింది. ఇప్పటికే మూడొంతులు పార్టీ వర్గీయులు టీడీపీ, జనసేన వైపు అనుకూలంగానే ఉన్నారు. పార్టీకి రాజీనామా చేయకపోయినా ఈ రెండు పార్టీలతోనే సాన్నిహిత్యంగా ఉంటున్నారు. ఏలూరు మేయర్ నూర్జహాన్, ఆమె భర్త పెదబాబులు, మరికొంతమంది కౌన్సిలర్లతో కలిసి త్వరలోనే టీడీపీలో చేరబోతున్నట్టు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ దాదాపు ఆరంభమైంది. అంటే ఏలూరు నగర కార్పొరేషన్ టీడీపీపరం కాబోతుందన్న మాట. దీనికి ఎమ్మెల్యే చంటి తగిన ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నట్టు చెబుతున్నారు. దీనికితోడు ఆళ్ల నానికి సమాం తరంగా ఇప్పుడు ఎవరికి పార్టీ పగ్గాలు అప్పగించాలన్నది పార్టీకి విషమ పరీక్షగానే భావించవచ్చు. ఆయన స్థానంలో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, పోలవరం మాజీ సీనియర్ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుల్లో ఒకరికి జిల్లా అధ్యక్ష పదవి దక్కే అవకాశాలు లేకపోలేదు. ఎందుకంటే ఇప్పటికే ఆ పార్టీలో జిల్లా అధ్యక్ష పదవికి ఈనెలాఖరులోపే ఎంపిక చేసే దిశగా కసరత్తు ఆరంభమైన తరుణంలోనే నాని తప్పు కోవడంతో ఈ ముగ్గురిలో ఒకరికి ఛాన్స్ ఖరారైనట్టే. ఏలూరు ఇన్‌చార్జి పదవిని సీనియర్‌లలో ఒకరికి అప్పగిస్తారని ప్రచారం సాగుతోంది.

# మా సమస్యలు పరిష్కరించండి..

- ప్రధాని మోదీని కలిసిన ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్
- నియోజకవర్గంలోని సమస్యల ప్రస్తావన
- సానుకూలంగా స్పందించిన ప్రధాని

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఏలూరు పార్లమెంటు సభ్యుడు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ శుక్రవారం ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, పోలవరం నిర్వాసితుల సమస్యలను, కొల్లేరు, పామాయిల్ రైతుల సమస్యలను ప్రధాన మంత్రికి వివరించారు. సమస్యలను సావధానంగా విన్న ప్రధాని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. తాను చెప్పిన సమస్యలను విని సానుకూలంగా స్పందించిన ప్రధానికి ఎంపీ మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ వేంకటేశ్వర స్వామి ప్రతిమను ప్రధానికి అందించారు. మరోవైపు పామాయిల్ రైతుల ప్రయోజనాలను కాపాడానికి దిగుమతి సుంకాలను తిరిగి విధించాలని కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ భరత్వాల్ ను ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో శుక్రవారం ఎంపీ మహేష్ యాదవ్ కలసి విన్నవించారు. కాగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఏలూరు నియోజకవర్గ ప్రజల్లో ప్రధాని సానుకూల స్పందన కొత్త ఆశావాదాన్ని నింపింది.



ప్రధాని మోదీని కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్

# సరిదిద్దాకే 'సర్దుబాటు'

-7లో

# శ్రావణలక్ష్మీ నమోస్తుతే..

- ఆలయాల్లో శ్రావణ తొలి శుక్రవారం పూజలు

ద్వారకా తిరుమల, ఆగస్టు 9 : శ్రావణ మాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయాలు కళకళలాడాయి. అయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ద్వారకా తిరుమల శ్రీవారి క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న కుంకుళ్లమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి కుంకుమ పూజలు జరిపారు. ఆలయ యాగశాలలో అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ చండీహోమాన్ని నిర్వహించారు.



ప్రత్యేక అలంకారంలో కుంకుళ్లమ్మ

# 63 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

ఏలూరుసిటీ, ఆగస్టు 9: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు, జూనియర్ సహాయకులకు, పదోన్నతి అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా డైరెక్టర్ ఆఫ్ పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖవారి ఆదేశాల మేరకు జిల్లాలో 80 మంది గ్రేడ్- 2 పంచాయతీ కార్య దర్శులుగా పదోన్నతి అర్హత సాధించారు. వీరిలో 17 మంది వ్యక్తిగత కారణాల వల్ల పదోన్నతి వదులుకోగా 63 మందికి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పదోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు.

పదోన్నతి పొందిన సిబ్బంది డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఉత్తర్వులు కాపీలను తీసుకున్నారు. పదోన్నతి కోసం ఏళ్ల తరబడి నిరీక్షించామని, కూటమి ప్రభుత్వంలో న్యాయం జరిగిందని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పశుగణనకు సహకరించండి

- పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 9 : జాతీయ పశుగణన కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లాలో పశుగణన చేపడుతున్నట్టు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు 31 వరకు పశుగణన నిర్వహిస్తున్నామ న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,093 మంది ఇన్యూమరేటర్లు పశుగణనలో పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో ఉన్న ప్రతీ పశువుకు చెవిపోగులు వేసి గణన చేపడతామన్నారు. పశువులు, కోళ్ళు, బాతులకు చెవిపోగు వేస్తామన్నారు. మినీ గోకులాల పథకాన్ని పునరుద్ధరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల మినీ గోకులాల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. జేడీ డాక్టర్ నెహ్రూ బాబు, డిప్యూటీ డైరెక్టర్లు గోవిందరాజు, డాక్టర్ కె.చంద్ర శేఖరరావు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదివాసీ దినోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి.. చిత్రంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తదితరులు

# విద్యపై దృష్టి పెట్టండి

- విద్యతో వెనుకబాటుతనాన్ని రూపుమాపవచ్చు
- ప్రతినెలా ఏజెన్సీ సమస్యల కోసం సమావేశం
- గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్‌ఫోన్ నంబరు ఏర్పాటు
- ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ వెట్రిసెల్వి

**ఏజెన్సీ అభివృద్ధికి రూ.100 కోట్లతో ప్రణాళిక**
ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం, ఆగస్టు 9 : 'విద్యతోనే వెనుకబాటుతనాన్ని రూపుమాప వచ్చు. చదువుతోనే తలరాతలు మారతాయి. ప్రతిఒక్కరూ చదువుపై దృష్టి పెట్టండి.. కష్టపడి చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు తయారుకండి' అంటూ గిరిజన బిడ్డలకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హితబోధ చేశారు. కేఆర్ పురంలో వైటీసీ సభా ప్రాంగణంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం జరిగింది. తొలుత ఆదివాసీ, జాతీయ జెండాలను ఎమ్మెల్యే బాలరాజు ఎగురవేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించడం కష్టమేమి కాదు. ఏజెన్సీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్‌ఫోన్ నంబరు ఏర్పాటు చేస్తాం. ప్రతినెలా ఏజెన్సీలోని ఐదు మండలాల్లో ఏదో ఒక మండలంలోని గ్రామంలో గిరిజనులతో సమావేశం నిర్వహిస్తాం'.. అని తెలిపారు. జేసీ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఏజెన్సీ అభివృద్ధికి 100 కోట్లతో ప్రణాళికను సిద్ధం చేసి ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు అందజేయగా సానుకూలంగా స్పందించారని, ఏజెన్సీలో పాడైపోయిన రోడ్లను బాగు చేయడానికి తక్షణమే రూ.20 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. గిరిజన సంఘాల నాయకులు లేవనెత్తిన ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ తాను చైర్మన్‌గా ఉన్నపుడు గిరిజనులకు 450 పొగాకు బ్యారన్ల నిర్మాణాలకు ఒక్కొ బ్యారన్‌కు మూడు లక్షలు, సుమారు రూ.300 కోట్ల వరకు వ్యవసాయ రుణాలను మంజూరు చేసినట్టు తెలిపారు. వచ్చే ఆదివాసీ దినోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహిస్తామని, వీలైతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలు, అమలు కాని చట్టాలు తదితర విషయాలను వివరించారు. పీవో జి.శ్రీనుకుమార్, ఆర్డీవో కె.అద్దయ్య, డీపీవో శ్రీనివాసు విశ్వనాథ్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టరు నాగేశ్వ రరావు, సీఈవో కె.సుబ్బారావు, ఏపీవో నాయుడు వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన చిన్నారుల నృత్యాలు**

చిన్నారులు చేసిన గిరిజన సంప్రదాయ నృత్యాలు సభికులను కట్టిపడేశాయి. గిరిజన మహిళలతో కలిసి కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే గిరిజన సంప్రదాయ నృత్యం చేశారు. కలెక్టర్, ఎమ్మెల్యేలను గిరిజనులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే బాలరాజు రూ.లక్ష, బొరగం శ్రీనివాస్ 50 వేలు ఆదివాసీ దినోత్సవానికి విరాళంగా అందజేశారు. ఉత్తమ సేవలు అందించిన వారిని సత్కరించారు. వివిధ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. గిరిజన అమర వీరులకు నివాళులర్పించారు. భారత రాజ్యాంగం పుస్తకాన్ని అవిష్కరించారు.





ఆదివాసీ మహిళలతో గిరిజన నృత్యం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ

## నాలుగు అడుగుల నల్లతాచు


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ క్రాంతి కుమార్

లేచిన రోజు బావుంది.. త్రుటిలో ప్రమాదం తప్పింది. లేదంటే కాటేసేదే.. గురవాయిగూడెం గ్రామానికి చెందిన రైతు దల్లి రామాంజనేయరెడ్డి తన పొలంలోని గేదెల షెడ్డులో ఉన్న గడ్డి తీస్తుండగా గడ్డిలో తాచుపాము బుస్ మంది. వెంటనే భయంతో పరుగులు పెట్టారు. స్నేక్ క్యాచర్ చదలవాడ క్రాంతికుమార్‌కు ఫోన్ చేయగా ఆయన వచ్చి పామును పట్టుకున్నారు. పట్టుకున్న పాము నల్లతాచు అని నాలుగు అడుగులు ఉందని అడవిలో విడిచి పెడతామని తెలిపారు.

- జంగారెడ్డిగూడెం


సమావేశంలో మాట్లాడుతున్న డీవీఎస్ వర్మ

## కార్పొరేట్ సంపద పంపిణీతోనే శ్రమజీవుల సంక్షేమ సమాజం

తణుకు, ఆగస్టు 9: కార్మికులకు, పేదలకు ఆర్థిక న్యాయం కల్పించే సంక్షేమ సమాజాన్ని సాధించడానికి కార్పొరేట్ సంపద పునం పంపిణీ జరిగి తీరాలని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం సాయంత్రం సీపీఐ కార్యాలయంలో క్విట్ కార్పొరేట్స్ డే సందర్భంగా రైతు, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. రైతు కార్యచరణ సమితి గౌరవాధ్యక్షుడు డీవీఎస్ వర్మ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు అన్ని పంటలకు లాభసాటి ధరలను చట్టబద్ధంగా కల్పించడానికి నిరాకరించడంపై నిరసనగా క్విట్ కార్పొరేట్ డే నిర్వహిస్తున్నామని చెప్పారు.ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి పనిగంటల పెంపుతో సహా వారి హక్కులను హరిస్తున్నారన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ల కోసమే ప్రభుత్వరంగ పరిశ్రమలను వరుసగా అమ్మకాలు చేస్తున్నదని విశాఖ ఉక్కును అమ్మే ప్రయత్నాలను ప్రతిఘటించాలని వివరించారు. సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు పేరూరి మురళీ కుమార్ తణుకు స్టడీ సర్కిల్ కార్యదర్శి డాక్టర్ బి.రమేష్, రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు సంకు మనోరమ, లంక కృష్ణమూర్తి, గొల్లపల్లి అంబేడ్కర్, నీలం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు చల్లా అప్పారావు, అజ్జరపు సుబ్బారావు, యర్రమిల్లి నరసింహారావు, సంకు అప్పారావు, వంక సత్య నారాయణ, భూపతిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులను సత్కరించారు.

## విస్సాకోడేరులో సఖి సెంటర్ తనిఖీ



పాలకోడేరు, ఆగస్టు 9: విస్సాకోడేరులో ఉన్న మిషన్ శక్తి పథకం సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైంగిక హింసకు గురైన మహిళలకు, బాలలకు అత్యవసర సేవలపై ఏం చర్యలు తీసుకుంటున్నారని ఆరా తీశారు. అడ్మినిస్ట్రేటర్ చుక్కా ధనలక్ష్మి బాధిత మహిళలకు అందించే సేవలు, సఖీ వన్ స్టాప్ సెంటర్ ఉద్యోగుల విధుల గురించి వివరించారు. బాధిత మహిళలు, బాలల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఎక్కడైనా ఎటువంటి సంఘటన జరిగినా టోల్‌ఫ్రీ నంబర్ 181ను సంప్రదించాలని కమిషన్ సభ్యురాలు సూచించారు. అంతకుముందు ఉండి ఉమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును క్యాంపు ఆఫీసులో వినీత మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు.

## వ్యాసరచన పోటీ విజేతలు వీరే

ఏలూరు అర్బన్, ఆగస్టు 9 : సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ'అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీ విజేతల జాబితాను మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు విడుదల చేశారు. సీనియర్స్ విభాగంలో కె.ఎస్.అమూల్య (వై.ఎస్ పాలెం), వి.గీతిక (ఏలూరు సత్రంపాడు), దీపిక (తిమ్మరాజు పాలెం) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో జి.సాహితి (అత్తిలి), ఎస్.బ్రాహ్మణి (గోపాలపురం), ఎం.హిమశ్రీవర్ష (పాలకొల్లు) విజేతలుగా నిలిచారు. సబ్ జూనియర్స్ విభాగంలో కె.శ్రావణి (అజ్జరం), ఎం.కార్తికేయ (ఉల్లంపర్రు), బి.జోషితసాయి (భీమవరం) తొలి మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం బహుమతులు అందజేస్తామన్నారు.



శ్రీనివాస్‌కు సెల్యూట్ చేస్తున్న కిమ్స్ సిబ్బంది.. శ్రీనివాస్ (ఫైల్)

## అవయవ దాతకు సెల్యూట్..

ఏలూరు రూరల్, ఆగస్టు 9: తాను మరణిస్తూ మరో ఐదుగురి జీవితాల్లో వెలుగు నింపారు బ్రెయిన్‌డెడ్ అయిన ఓ వ్యక్తి. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా ఇతరులకు సాయం చేయాలని ఆ కుటుంబం తీసుకున్న నిర్ణయం అందరికి మార్గదర్శంగా నిలిచింది. భర్త మరణిస్తే అతని అవయవాలు దానం చేసి గొప్పమనసు చాటుకున్నారు. ఏలూరు దక్షిణపు వీధికి చెందిన తమ్మన శ్రీనివాసరావు (58) కొద్ది రోజుల క్రితం అకస్మాత్తుగా అనారోగ్యం పాలై బ్రెయిన్‌డెడ్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించింది. దీంతో అతని భార్య, కూతురు, శ్రీనివాసరావు అవయవ దానానికి ముందుకు వచ్చారు. శ్రీనివాసరావు నుంచి సేకరించిన అవయవాలు మరో ఐదుగురికి అమర్చారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని శుక్రవారం ఏలూరు తీసుకువచ్చారు. నగర ప్రముఖులు, ఆర్యవైశ్యులు అతని భౌతిక కాయానికి నివాళులర్పించారు.

## రేపు దేవదాయ శాఖ సిబ్బంది సమావేశం

భీమవరంటౌన్, ఆగస్టు 9 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా దేవదాయ శాఖ సిబ్బంది సమావేశం ఈనెల 11న తణుకు పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కడలి అనంతరావు, కార్యదర్శి జయరాం, కోశాధికారి నల్లం రామకృష్ణ తెలిపారు. సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవటంతో భవిష్యత్తు కార్యచరణ, సిబ్బందిచే ప్రతిపాదించిన ఇతర విషయాలపై చర్చిస్తారన్నారు.

## ట్రిపుల్ ఐటీ రెండో విడత కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, ఆగస్టు 9: ఆర్‌జీయుకేటీ పరిధిలో రెండో విడత జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు సంబంధించి 238 మందికి కాల్ లెటర్స్ పంపగా 134 మంది ప్రవేశాలు పొందారు. అదే విధంగా ఆర్‌కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి 518 మందిని పిలువగా 310 మంది ప్రవేశాలు పొందినట్లు అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు. మిగిలిన సీట్లకు త్వరలో మూడో దశ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.




గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద జలపాతం...


ఆచంట మండలం కోడేరు వద్ద స్వల్పంగా పెరిగిన గోదావరి

# వరద తగ్గుముఖం

పోలవరం/చింతలపూడి/ బుట్టాయగూడెం/ ఆచంట/ఏలూరు క్రైం ఆగస్టు 9: గోదావరి ఉధృతి కాస్త తగ్గింది. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.20 అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 7,35,421 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను అధికారులు దిగు వకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.390 మీటర్లు, స్పిల్‌వే దిగువన 22.740 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు అధికారులు తెలిపారు. తమ్మిలేరు జలాశయం వద్ద ప్రస్తుతం నీటిమట్టం 348 అడుగులకు చేరింది. ఎగువ నుంచి 3730 క్యూసెక్కుల వరదనీరు రాగా 4 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

### శాంతించిన కొండవాగులు

వారం రోజులుగా ఏజెన్సీ వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మన్యంలోని కొండవాగులు శుక్రవారం తగ్గుముఖం పట్టాయి. దీంతో ఏజెన్సీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం వరకు కూడా ప్రమాదకర స్థాయిలోనే ప్రవహించాయి. మధ్యాహ్నం నుంచి వర్షం లేకపోవడంతో క్రమంగా తగ్గింది. గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద ఉన్న ఎర్ర ఎక్కుడు కొండవాగు ఉధృతంగా ప్రవహించగా శుక్రవారం పూర్తిగా తగ్గిపోయి జలపాతంలా చూపరులకు కనువిందు చేసింది.

### గోదావరి దోబూచులాట

గోదావరి దోబూచులాడుతూనే ఉంది. కొన్ని రోజులుగా గోదావరి తగ్గి పుష్కర ఘాట్ సైతం బయట పడ్డాయి. అయితే మరలా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా వరద నీరు చేరడంతో శుక్రవారం గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతుంది. పుష్కర ఘాట్‌లు మునిగాయి.

### తమ్మిలేరు తగ్గింది

తమ్మిలేరు వాగు వరద ప్రవాహంతో ఏలూరు నగరంలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ళల్లోనికి గురువారం రాత్రి చేరింది. ఏలూరు ఆర్డీవో ఖాజావలి ఆధ్వర్యంలో కొన్ని కుటుంబాలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తమ్మిలేరు నీరు శుక్రవారానికి తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి ఇంకా తగ్గిపోయి ఏలూరు నుంచి శనివారపుపేట వెళ్ళే లోబ్రిడ్జిపై నుంచి నీటి ప్రవాహం లేకపోవడంతో శుక్రవారం నుంచి వాహనాల రాకపోకలకు పోలీసులు అనుమతించారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో ఉన్న జలాశయం నుంచి మూడు గేట్ల ద్వారా నీరు గురువారం విడుదలవడంతో దీంతో ఒకేసారి వరద నీరు రావడంతో వాహనాలను నిలిపివేశారు. ఏలూరు శనివారపుపేట లోబ్రిడ్జిపై నుంచి ప్రవహించింది. శుక్రవారం సాయంత్రానికి నీటి తగ్గుముఖం పట్టడంతో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.


ఏలూరులో కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు

## వరదొస్తే రాకపోకలు బంద్

### ఆందోళనలో సమీప గ్రామాల ప్రజలు

### కాజ్‌వేపై వంతెన నిర్మించాలని వేడుకోలు

ఏలూరు రూరల్, ఆగస్టు 9:ఏలూరు నియోజకవర్గంలో వర్షం వస్తే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.వరదలు వస్తే కంటిపై కునుకు కరువు అవుతుందని వాపోతున్నారు. వరదొస్తే ఇతర గ్రామాలతో సంబంధాలు ఉండవు. శనివారపుపేట కాజ్‌వేపై వరద వచ్చిన ప్రతిసారి సమీప ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలో తమ్మిలేరు వరద తాకిడి పెరగడంతో శనివారపుపేట కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరదనీరు ప్రవహించి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాజ్‌వేపై వంతెన నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ప్రతిఏడాది తమ్మిలేరుకు వరద పోటెత్తిన ప్రతిసారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరదొస్తే కాజ్‌వేపై శనివారపుపేట, దుగ్గిరాల వెళ్ళే ప్రాంతాలకు సంబంధాలు ఉండవు. మూడు కిలోమీటర్లు చుట్టుతిరిగి రావాల్సి ఉంటుంది.వైసీపీ ప్రభుత్వ హయాంలో శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మించటానికి చర్యలు చేపట్టినా కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా వానాకాలంలో వరద నీరు కాజ్‌వేపై నుంచి వరద పారుతుంటే పాదచారులు, కళాశాల విద్యార్థులు, వాహనదారులు ఏలూరు నుంచి శనివారపుపేట, విద్యానగర్, దుగ్గిరాల మీదుగా నూజివీడు వెళ్ళేవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

# సరిదిద్దాకే 'సర్దుబాటు'

### స్థానభ్రంశానికి సీనియార్టీ ప్రామాణికతపై అభ్యంతరాలు

### కొత్త జిల్లాల ప్రకారమే మండలాల్లో టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్

### పరిశీలనకు 'మిగులు' టీచర్లు, వేకెన్సీల జాబితాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 9 : సీనియార్టీ, పలువర్గాలకు మినహాయింపుల కోసం డిమాండ్లు వెల్లువెత్తడంతో వాటిని వీలైనంతమేర పరిష్కరించిన తర్వాతే టీచర్ల పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్)ను చేపట్టేందుకు వీలుగా వాయిదా వేశారు. పలు అంశాలపై వివరణలు అవసరమైనందున శుక్రవారం జరగాల్సిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు తాత్కాలికంగా నిలిపివేయాలని అన్ని మండలాల ఎంఈవోలకు ఆదేశాలు జారీచేశారు. సోమవారం తర్వాతే ఈ మొత్తం ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి, మార్గదర్శకాల్లో కొన్ని సవరణల అనంతరమే మళ్ళీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టే అవకాశాలున్నాయి. మరోవైపు కొత్త జిల్లాల ప్రాతిపదికన ఆయా మండలాల వారీగా సర్‌ప్లస్ టీచర్లు, డెఫిసిట్ పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా వేకెన్సీల వివరాలతో కూడిన జాబితాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖకు పంపిన ఉన్నతాధికారులు సంబంధిత వివరాలను మరోదఫా పరిశీలించుకోవాలని సూచించింది. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్)లో కొందరు ఉద్యోగంలో చేరిన తేదీ తదితర అంశాల్లో తప్పులు నమోదు చేయడాన్ని గుర్తించి వాటిని సరిచేసి పంపాల్సిందిగా జిల్లా అధికారులకు సూచించారు. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో సుమారు 370 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు (మున్సిపల్ 'మిగులు' మినహాయించి) సర్‌ప్లస్ జాబితాలో ఉండగా, 220 మందిని కొరతవున్న పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నిబంధనల మేరకు తాత్కాలిక సర్దుబాట్లు చేస్తారని తెలిసింది. భీమవరం కేంద్రంగా వున్న పశ్చిమగోదావరి జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ సర్‌ప్లస్ టీచర్లు, కొరత వున్న పాఠశాలల వివరాలను అక్కడి విద్యాధికారులకు పంపించగా, స్థానికంగా వున్న అక్కడి మండలాల్లోనే సర్దుబాట్లు చేయాల్సి ఉంటుంది.

### ఈ అభ్యంతరాలపై సవరణలకు అవకాశం

మండల స్థాయిలో సర్‌ప్లస్ టీచరును స్టేషన్ (ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల)సీనియార్టీ ప్రకారం ప్రామాణికంగా తీసుకుని అక్కడి జూనియర్‌ను కొరతవున్న పాఠశాలకు సర్దుబాటు చేయాలన్నది తొలుత జారీ చేసిన మార్గదర్శకంగా ఉంది.డివిజన్ స్థాయికి వచ్చేసరికి కేడర్ సీనియార్టీని ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా ఈ రెండూ ద్వంద్వ ప్రమాణాలని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాన్ని తెలిపాయి. గతేడాది మార్చిలో నిర్వహించిన సాధారణ బదిలీల్లో ఆయా పాఠశాలలకు బదిలీని కోరుకున్న సీనియర్ టీచర్లుసైతం మండలస్థాయిలో ఇపుడు జూనియర్లు అయిపోతారని, ఆ ప్రకారం సీనియర్లను ఏడాదిన్నరలోగా మరో స్కూలుకు సర్‌ప్లస్ పేరిట పంపేయడం సహేతుకంగా లేదన్నది ప్రధాన అభ్యంతరంగా ఉంది. ఇటువంటి సీనియర్లలో గరిష్టంగా ఒకేస్కూలులో 8 ఏళ్ళ లాంగ్ స్టాండింగ్‌పై తప్పనిసరిగా బదిలీ అయిన ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. అయితే ప్రభుత్వ వాదన మరోలా ఉంది. సంబంధిత స్కూలులో గరిష్ట స్టేషన్ సీనియార్టీకి లోబడి పనిచేస్తున్న టీచర్లు పాఠశాల విద్యార్థులతో మమేకం అయి ఉండటంతో పాటు, స్కూలు అభివృద్ధికి కృషిచేసి ఉంటారని అందువల్ల అక్కడ జూనియర్‌ను కొరతవున్న చోటకు సర్దుబాటు చేయడం సహేతుకమేనని విద్యాశాఖ ఉన్నతాధికారులు సమర్థించు కుంటున్నారు. ఆ ప్రకారం మండల, డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌లకు కేడర్ సీనియార్టీనే ప్రామాణికంగా తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు పట్టు బడుతుండటంతో పీటముడి పడింది. ఇక నూరుశాతం దృష్టిలోపం వున్న టీచర్లకు మాత్రమే పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వడం సరికాదని, దీనిని 70 శాతానికి కుదించడంతో పాటు, శారీరక వైకల్యం, బైపాస్ శస్త్ర చికిత్స చేయించుకున్న టీచర్లనుకూడా వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి మినహాయించాల్సిందేనంటూ ఉపాధ్యాయ నాయకులు పట్టుబడు తుండటం కూడా ఓ ఆటంకంగా పరిణమించింది. ఇక సర్దుబాటుకు సాంకేతికంగా అవరోధాలు తలెత్తే మున్సిపల్ సర్‌ప్లస్ టీచర్ల విషయమై ఏంచేయాలో డైలమా నెలకొంది. వీటితో పాటు గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో 117 ఉత్తర్వుల ప్రకారం కాకుండా, వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం నూతన మార్గదర్శకాలు తీసుకు వచ్చేవరకు వాయిదా వేయాలని కోరుతున్నాయి. మరికొన్ని అభ్యంతరాలు కూడా ఉన్నందున వాటిలో కొన్నింటి నైనా పరిష్కరించి ఉపాధ్యాయులను సంతృప్తి పరిచిన తర్వాతే పని సర్దుబాటు చేపట్టేందుకు వీలుగా కొన్ని రోజులపాటు వాయిదా వేసినట్టు చెబుతున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

## 23న నరసాపురంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం టౌన్, ఆగస్టు 9 : ఈనెల 23న నరసాపురంలో నిర్వహించే ఉద్యోగ దిక్సూచి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నిరుద్యోగ యువత ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నరసాపురం వైఎన్ డిగ్రీ కాలేజీలో 23న ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అమర రాజా గ్రూప్, షిరిడీ సాయి సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ, జగదీష్ మెరైన్, సంధ్యమెరైన్, సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్ హెటిరో ఫార్మా, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, బ్లూస్టార్ మొదలైన ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని ఇతర కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు నాగేంద్ర- 95020 24765 ప్రసన్న 70138 96277 రాధిక 94418 41622 నంబర్లలో సంప్రదిం చాలని కలెక్టర్ తెలిపారు. పేదల ఇళ్ళలో ప్రగతి కనిపించాలి జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలలో మెరుగైన ప్రగతి కనిపించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.వశిష్ట కాన్ఫరెన్స్‌హాల్‌లో గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీ పి.పిచ్చయ్య, నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారావు పాల్గొన్నారు.

## మెడికల్ షాపుల్లో తనిఖీలు



ఏలూరు క్రైం, ఆగస్టు 9 : ఏలూరు మెడికల్ షాపుల్లో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధి కారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అసిస్టెంట్ డైరెక్టర్ హరి ప్రసాద్‌తో పాటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు డాక్టర్ బాలు, మల్లిఖార్జున్ సిబ్బంది పాల్గొన్నారు. సద్భావన మెడికల్స్, సూర్య, సిరి, గ్లోబల్, అరుణోదయ, సాయిశ్రీ పవన్ మెడికల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిం చారు. ఒక షాపులో అబార్షన్ కిట్లు, మరో రెండు షాపుల్లో నార్కోటిక్ డ్రగ్స్ మిస్‌యూజ్ అయి నట్లు గుర్తించారు. వాటిపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటికే తాడేపల్లిగూడెం, భీమవరం, గణపవరం ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి మూడు షాపుల లైసెన్సులు రద్దు చేశామని తెలిపారు. మెడికల్ షాపుల్లో తప్పనిసరిగా మందుల అమ్మకాలకు సంబంధించి బిల్లులు ఉండాలన్నారు. గర్భనిరోధక మాత్రలు, అబార్షన్ కిట్లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

## 40 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టివేత

కొయ్యలగూడెం, ఆగస్టు 9:మండలంలోని కన్నాపురంలోని ఒక గొడౌన్‌లో40 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం దాడి చేయగా 40 క్వింటాళ్ళ రేషన్ బియ్యం దొరికింది. దీని విలువ సుమారు రూ.లక్షా 60 వేలని తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన శ్రీనివాసరావుపై 6(ఏ), 7(1) కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలవరం సీఐ మధుబాబు, ఆర్ఐ దివ్య వీఆర్వోలు పాల్గొన్నారు.

### 15 క్వింటాళ్లు స్వాధీనం

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 9 : బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని జంగారెడ్డిగూడెం సీఎస్‌డీటీ లక్ష్మీ కుమారి శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. ఎం.నవీన్ కుమార్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి ఆదేశాల మేరకు నవీన్ కుమార్‌కు చెందిన శరవణ కిరాణా దుకాణంలో డీఎస్‌వో సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 17 గ్యాస్ సిలిండర్లు, 2.80 క్వింటాళ్ళ రేషన్ బియ్యం, సివిల్ సప్లై ముద్ర కలిగిన 86 పంచదార ప్యాకెట్లు, రెండు ఎలక్ట్రానిక్ కాటాలు సీజ్ చేశారు.



స్క్రీన్‌పై పోటీలను వీక్షిస్తున్న జ్యోతికశ్రీ తల్లిదండ్రులు, మాంటిస్సోరి స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు

## ఒలింపిక్స్ పోటీల్లో తణుకు అమ్మాయి..

### ఆసక్తిగా తిలకించిన జనం

తణుకు, ఆగస్టు 9 : తణుకు పట్టణానికి చెందిన అథ్లెట్ దండి జ్యోతిక శ్రీ ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో పరుగుపందెం పోటీల్లో పాల్గొంది. ఆమె పతకం సాధించాలని జిల్లా ప్రజలు ఆకాంక్షించారు. శుక్రవారం మధాహ్నం జరిగిన పోటీలను వీక్షించడానికి టీవీల ముందు అతుక్కుపోయారు. జ్యోతికశ్రీ ప్రాథమిక విద్యనభ్యసించిన మాంటిస్సోరి స్కూలులో స్క్రీన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులతో పాటు, జ్యోతికశ్రీ తల్లిదండ్రులు శ్రీనివాసరావు, లక్ష్మిలు వీక్షించారు. మాంటిస్సోరి స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు మాట్లాడుతూ జ్యోతికశ్రీ 6 నుంచి పదివరకు ఇక్కడే చదువుకుందన్నారు. సంవత్సరంలో సగం రోజుల శిక్షణ కోసం వెళ్లినప్పటికి పదో తరగతిలో 90 శాతంతో ఉత్తీర్ణత సాధించిందన్నారు. ఒలింపిక్స్ వరకు జ్యోతిక వెళ్ళడం స్కూలుకు, పట్టణానికి, రాష్ట్రానికి, దేశానికి గర్వకాణమన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎన్నో మెట్లు అధిగమించి ఒలింపిక్స్ వరకు వెళ్ళిందని భవిష్యత్తులో ఖచ్చితంగా పతకం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



కోమటిగుంటలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు.. సీసలిలో అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ

## అమ్మవారికి శ్రావణ మాసం సారె

కాళ్ళ, ఆగస్టు 9 : కాళ్ళ మండలం కోమటిగుంటలో ఉన్న విజయకనకదుర్గమ్మ అమ్మవారికి శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా గ్రామస్థులు సారె సమర్పించారు. అమ్మవారికి 11 రకాల స్వీట్స్, పువ్వులు, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లను గ్రామంలోని కోదండ రామాలయం వద్ద నుంచి సుమారు 150 మంది మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈనెల 14వ తేదీన బుధవారం అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు యలమంచిలి వెంకటరమణ, రామాంజనేయులు, గణపతి, రామాలయం కమిటీ సభ్యులు మంతెన నాగాంజనేయులు, గుర్రం సత్యనారాయణ, పులమంతుల ఏసురాజు, వీసం శ్రీను, యలమంచిలి బాబ్జి, కాపుశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. సీసలి లక్ష్మీ దుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి 110 కిలోల పసుపు కొమ్ములతో అలంకరణ చేశారు.

## క్రైం కార్నర్

### వాట్సాప్ ఫొటోలు మార్ఫింగ్ ..

### బెదిరించి సొమ్ములు డిమాండ్ చేస్తున్న వ్యక్తి అరెస్టు



ఏలూరు క్రైం, ఆగస్టు 9: సోషల్ మీడియాలో ప్రొఫైల్ ఫోటోలను డౌన్‌లోడ్ చేసుకుని న్యూడ్ ఫోటోలుగా మార్ఫింగ్ చేసి తిరిగి వాటిని పంపించి సొమ్ములు ఇవ్వాలని బెదిరిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన ఒక మహిళ తన కుమార్తె ఫోటోలను వాట్సప్‌లో ప్రొఫైల్‌గా పెట్టుకున్నారు. ఆ ఫోటోను ఒక వ్యక్తి డౌన్‌లోడ్ చేసుకుని మార్ఫింగ్ చేసి ఆమె వాట్సప్‌కే పంపించి సొమ్ములు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు ఈనెల 2వ తేదీన ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ రాజారెడ్డి, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన నెల్లూరు జిల్లా సంఘం మండలం బెండదిబ్బ గ్రామానికి చెందిన షేక్ షకీర్ (26) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని ఫోన్‌లో 20 మంది యువతుల ఫోటోలను ఇదే విధంగా మార్ఫింగ్ చేసి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మహిళలు తమ ఫోటోలు, పిల్లల ఫోటోలు కానీ వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో గాని షేర్ చేయవద్దని సీఐ సూచించారు.

### అదుపుతప్పిన మోపెడ్..దంపతులకు గాయాలు

ఉంగుటూరు, ఆగస్టు 9 :జాతీయ రహదారిపై కైకరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలయ్యాయి. నిడమర్రు మండలం ఎనికేపల్లికి చెందిన దుర్గం పెద్దిరాజు, ఆయన భార్య పల్లాలు మోపెడ్‌పై పూళ్ళలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా డివైడర్ సమీపంలో అదుపుతప్పి పడిపోయారు. పల్లాలు తలకు వెనుక భాగం దెబ్బ తగిలింది. దీంతో వీరిద్దరినీ హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### చేపలు పట్టేందుకు వెళ్లి కాల్వలో పడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 9 : చేపలు పట్టడానికి వెళ్లి ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఏలూరులోని మరడాని రంగారావు కాలనీకి చెందిన దోసపల్లి గురవయ్య (30) ఏలూరు రూరల్ మండలం మొండికోడు వద్ద కాలువలో చేపలు పట్టడానికి శుక్రవారం మధ్యాహ్నం గేలం వేశాడు. అక్కడ గుర్రపుడెక్కపై అడుగు వేయగా అకస్మాత్తుగా పడిపోయి మునిగిపోయాడు. తిరిగి పైకి రాలేక మృత్యువాత పడ్డాడు. సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### ఆటో తిరగబడి ఇద్దరికి గాయాలు

భీమవరం క్రైం, ఆగస్టు 9 : వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి తిరగబడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మొగల్తూరు మండలం కాళీపట్నంకు చెందిన బాలం మేరీ రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులతో శుక్రవారం పాలకోడేరులో పుట్టినరోజు ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వెళ్తుండగా భీమవరం మండలం తోకతిప్ప పెట్రోల్ బంక్ వద్ద ఆటో అదుపు తప్పి తిరగబడింది.దీంతో రాజ్యలక్ష్మి, బేబి, భూలక్ష్మీలకు గాయాలు అయ్యాయి. ఆటోలో 8 మంది ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రాజు తెలిపారు.

### దారి విషయంలో ఇరు వర్గాల కొట్లాట

భీమవరం క్రైం, ఆగస్టు 9 : దారి విషయంలో ఇరు వర్గాలు తగాదా పడటంతో పలువురికి గాయాలయ్యాయి. ప్రస్తుతం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రూరల్ స్టేషన్ రైటర్ మహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం తోకతిప్ప గ్రామానికి చెందిన బొడ్డు ఏసురాజుకు పొన్నాల ఏసేబురాజుకు దారి విషయంలో పాత గొడవలు ఉన్నాయి. దీన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి ఇరువర్గాలు తగాదా పడ్డారు. దీంతో అటు నలుగురు, ఇటు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### బ్రాందీ షాపులో చోరీ కేసు..ఇద్దరికి జైలు

ఉంగుటూరు, ఆగస్టు 9 : నారాయణపురం ప్రభుత్వ మద్యం దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధించినట్టు చేబ్రోలు ఎస్ఐ మణి కుమార్ తెలిపారు.మండలంలోని నారాయణపురం ప్రభుత్వ మద్యం దుకాణంలో 2021 సంవత్సరంలో రూ.3,38,580 నగదు దొంగిలించినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో శుక్రవారం తాడేపల్లిగూడెం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.అరుంధతి తీర్పు నిచ్చారు.ఈ కేసులో రెండో నిందితుడు తిరుమలశెట్టి హరిబాబుకు రెండు సంవత్సరాల నాలుగు నెలల జైలు మూడో నిందితుడు రావూరి మహేష్‌కు ఇరవై నెలలు సాధారణ జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించినట్టు వివరించారు.



రామకోటి సమీపంలో సిద్ధమైన అన్న క్యాంటీన్ భవనం

# అన్న క్యాంటీన్ ముస్తాబు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 9: అన్న క్యాంటీన్లను ఈ నెల 15న ప్రారంభిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం ఆగస్టు 15లోపు అన్నక్యాంటీన్లు తెరుస్తామని చెప్పిన నేపథ్యంలో నగరంలో నాలుగు అన్న క్యాంటీన్లను మరమ్మతులు చేపట్టారు. రామకోటి వద్ద క్యాంటీన్ ముస్తాబైంది. తంగెళ్ళమూడి వంతెన, స్టేట్‌బ్యాంకు మెయిన్ బ్రాంచ్ వద్ద, ఆర్ఆర్.పేట వెంకటేశ్వరస్వామి గుడి వద్ద, వన్‌టౌన్‌లో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలు వద్ద నాలుగు క్యాంటీన్లను మరమ్మతు చేశారు. 4 క్యాంటిన్లకు రూ.32.44లక్షలు ఖర్చవుతాయని అంచనా వేశామన్నారు. టెండర్లు కూడా పిలిచామన్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది అన్న క్యాంటీన్ల పనుల్లో నిమగ్నమయ్యారన్నారు.

## గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు


సమస్య వివరిస్తున్న బాధిత మహిళ

పెదవేగి, ఆగస్టు 9: గ్రామాల్లో విద్వేషాలు, విభేదాలు సృష్టించి, ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హెచ్చరించారు. దుగ్గిరాల కార్యాలయంలో పలువురు ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. అప్పనవీడుకు చెందిన మహిళ తనను అన్యాయంగా కొట్టి, గాయపర్చారని, న్యాయం చేయాలని వేడుకుంది. ఎమ్మెల్యే ప్రభాకర్ పెదపాడు ఎస్ఐకు ఫోన్‌చేసి దాడిచేసి సంఘటనపై విచారణ జరిపి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాడులకు తెగబడుతున్న వారిని ఉపేక్షించబోమన్నారు.

## తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం : ఎమ్మెల్యే ధర్మరాజు


గర్భవతికి సీమంతంలో ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, ఆగస్టు 9: తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చేబ్రోలు అంగన్వాడీ సెంటర్‌లో తల్లులు, బాలింతలు, కిశోర బాలికలతో తల్లిపాల గొప్పతనంపై అవగాహన కల్పించారు. గర్భవతులకు సీమంతం నిర్వహించారు. సర్పంచ్ రాంధే లక్ష్మీసునీత, సూపర్‌వైజర్ శారదామణి, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, శ్రీదేవి, కె.శాంతకుమారి, కాళిక, కుమారి, గౌరీపార్వతి పాల్గొన్నారు.

## మహేశ్‌బాబు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే చంటి


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, ఆగస్టు 9: సినీ హీరో మహేశ్‌బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. సత్యనారాయణ థియేటర్ వద్ద మహేశ్‌బాబు అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ మహేశ్‌బాబు అభిమాని రాజేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో అభిమానులు రూ.20వేలను ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమన్నారు. చెక్కును ఎమ్మెల్యే చంటి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు నాని, వైస్‌ప్రెసిడెంట్ సైమన్, మణికంఠ, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● పోలవరం: సినీ హీరో మహేశ్‌బాబు జన్మదిన వేడుకలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో భోజనం ఏర్పాటు చేశారు. గంగాభవాని థియేటర్‌లో మురారి సినిమా ప్రదర్శించి సంబరాలు చేశారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కొయ్యలగూడెం, ఆగస్టు 9: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం అన్నారు. బయ్యన్నగూడెంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ అధికారుల నిత్యం క్లోరినేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్బారావు, మోహన్, ఏఎన్ఎంలు పద్మావతి, నాగమణి, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అడవులను ధ్వంసం చేస్తున్న వారిని తరిమికొడదాం

పోలవరం, ఆగస్టు 9: అడవులను పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులను దేశం నుంచి తరిమికొట్టాలని ఏజన్సీ గిరిజన సంఘం రైతుకూలీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, క్విట్ ఇండియా డే సందర్భంగా పోలవరంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఏటిగట్టు సెంటర్ వద్ద ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ఏజన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ అడవులను కొండలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ కేంద్ర రాష్ట్ర పాలకులు విధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. గిరిజన సంక్షేమ చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. 30 ఏళ్లుగా గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు, హక్కులు కల్పించాలని కోరారు. ఏజన్సీ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయ వినాశన బిల్లులు ఉపసంహరించాలి

చింతలపూడి, ఆగస్టు 9: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై వినాశకర బిల్లులు ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష రైతులు డిమాండ్ చేశారు. ఫైర్‌స్టేషన్‌లో సెంటర్లో శుక్రవారం నిరసన వ్యక్తం చేస్తూ ప్రదర్శన జరిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ప్రదర్శన జరిపారు. ప్రదర్శనలో రైతు నాయకులు కృష్ణ మాట్లాడుతూ మూడు నల్ల చట్టాల వల్ల కార్పొరేట్లకు ఉపయోగం తప్ప రైతులకు ఉపయోగం లేదని, వాటిని ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైతుసంఘ నాయకులు రంగనాథ్, బాబు, ఎస్.సూరికుమార్, ఎస్.కె కాలీషా, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

లింగపాలెం, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురువేసేలా చైతన్యం కలిగించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. మఠంగూడెంలో బీజేపీ మండల సమావేశం శుక్రవారం జరిగింది. కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్ మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగా యాత్ర చేయాలని, జాతీయనాయకుల విగ్రహాల వద్ద నివాళులర్పించాలన్నారు. అగ్రహారం వెంకటేశ్వరరావు, రాయంకుల చక్రధరరావు, ఒంటెద్దు ఏసువరప్రసాద్, వెంకటనాగేశ్వరరావు, కొత్తూరు పుల్లయ్య, బండారు సత్యనారాయణ, కొటారు శివన్నారాయణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయలక్ష్మి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సీపీఐ సంతాపం

టి.నరసాపురం, ఆగస్టు 9: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు టీవీఎస్ రాజు శుక్రవారం సంతాపం తెలిపారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన జ్యోతిబసు మృతిచెందిన అనంతరం బుద్ధదేవ్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారని, ఆయన మృతి బాధాకరం అన్నారు. షేక్ జాకీర్ హుస్సేన్, కొండముచ్చు శ్రీనివాసరావు, మల్లుల సత్యనారాయణ, సతీష్, సుబ్బారావు, తదితరులు సంతాపం తెలిపారు.

## తహసీల్దారు చొరవతో బురద సమస్య పరిష్కారం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 9: తహసీల్దారు కె.స్లీవ జోజి చొరవతో మార్కెట్ యార్డులోని పౌర సరఫరాల శాఖ గోడౌన్ (ఎంఎల్ఎస్ పాయింట్) వద్ద బురద సమస్య పరిష్కారమైంది. వర్షాలకు రోడ్డుపై బురదమయం కావడంతో స్టాకు రిసీవ్ చేసుకోవడానికి వచ్చే రేషన్ డీలర్లు మహిళలు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు పఠాన్ అన్వర్‌బాషా, కంచర్ల రమేష్ తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లారు. సీఎస్ డీటీ వైవి.లక్ష్మీ కుమారి ఆధ్వర్యంలో మెటల్‌ను పోయడంతో తాత్కాలికంగా సమస్య పరిష్కారమైంది.


సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు చేస్తున్న మహిళలు, సౌభాగ్యలక్ష్మి అమ్మవారు, పట్టుచీరల అలంకరణలో కనకదుర్గమ్మ, సుబ్రహ్మణ్యేశ్వరి ఆలయంలో నాగ పంచమి పూజలు

# శ్రావణ శోభ

### ఆలయాల్లో మహిళల ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 9: శ్రావణమాసం తొలి శుక్రవారం నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. బావిశెట్టివారిపేట కనక దుర్గాంబకు 500 పట్టుచీరలతో అలంకారం చేశారు. సౌభాగ్యలక్ష్మీదేవిని ధాన్యలక్ష్మీదేవిగా అలంకరించి మహిళలు వరలక్ష్మీవ్రతాలు నోచుకున్నారు. అంబికాదేవి ఆలయంలో మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు చేశారు. అగ్రహారంలోని రాజ్యలక్ష్మి, జ్ఞాన సరస్వతి, కన్యకాపరమేశ్వరి, దక్షిణపువీధిలోని బాల త్రిపుర సుందరి, మహిషాసుర మర్దిని ఆలయాల వద్ద మహిళలు పూజలు చేశారు. శుక్రవారం గరుడ పంచమి, నాగ పంచమి సందర్భాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు పోస్టల్ కాలనీలోని నాగదేవత ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పుట్టలోను, జంట నాగుల విగ్రహాలకు పాలుపోసి ఆరాధించారు.

● పోలవరం: శ్రావణ మాసం తొలి శుక్రవారం మండలంలో కనకదుర్గ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. పోలవరం బస్ షెల్టర్ వద్ద, నూతన గూడెం, బంగారమ్మపేట, కృష్ణారావుపేట, గూటాల కనకదుర్గ ఆలయాలు, పట్టిసీమ మంగళ చండికా ఆలయం, ఎల్ఎన్‌డీపేట దుర్గాభవాని ఆలయం, పోలవరం వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.


కుక్కునూరులో ఆదివాసీ నేతల చిత్రపటాల వద్ద నివాళి


వేలేరుపాడులో గిరిజన సంఘాల ర్యాలీ


ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఆదివాసీల ప్రదర్శన


చింతలపూడిలో ఆదివాసీ జెండా ఆవిష్కరణ

# ఆదివాసీ సంబరం

### గిరిజన సంఘాల ప్రదర్శనలు, జెండా ఆవిష్కరణ

బుట్టాయగూడెం, ఆగస్టు 9: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏజెన్సీ ప్రాంతంలో శుక్రవారం ఆదివాసీల సంబరాలు అంబరాన్నంటాయి. వాడవాడల ఆదివాసీల జెండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక నాయకులు, గిరిజన సంఘాల నేతలు జెండాలను ఎగురవేశారు.

కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా ఆదివాసీలు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేష్ పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుట్టాయగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వెట్టి సుబ్బన్న అధ్యక్షతన జరిగిన సభలో సురేష్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వాలు అటవీ చట్టాల్లో సవరణలు చేస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీలను అడవుల నుంచి తరిమివేయడానికి, ఖనిజ సంపదలను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ఆదివాసీలపైనే ప్రభుత్వం యుద్ధం చేస్తుందన్నారు. నాయకులు పి.శ్రీనివాస్, కారం రాఘవ, కెవి రమణ, ఈ.భూషణం, వెట్టి భారతి మాట్లాడారు. టి.బాబురావు, కె.పోతురెడ్డి, జి.ప్రసాదు, కె.గోవిందరాజు, సర్పంచ్‌లు కారం లక్ష్మీ, కెచ్చెల ముక్కారెడ్డి, మడివి శ్రీరాములు, బి.వినోద్, పి.లత, కె.నాగార్జున, వి.వెంకటేశ్వరరావు అధిక సంఖ్యలో ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

● చింతలపూడి: మండలంలోని వెంకటాపురంలో ఎస్టీ బంజారా సుగాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం ఎందరో ప్రాణాలు త్యాగాలు చేశారన్నారు. 500 జనాభా ఉన్న గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని మైదాన ప్రాంతాల్లో వారికి ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, తండాలలో తాగునీరు, రోడ్లు, వీధిదీపాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, భూమిలేని గిరిజన కుటుంబానికి మూడు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ పెంచాలని ఎస్టీ సబ్‌ప్లాన్ కమిటీలో సభ్యులుగా నియమించాలని నామినేటెడ్ పదవులు కేటాయించాలని తీర్మానాలు చేశారు. నాయకులు నామవరం సర్పంచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కీమ్లా నాయక్, రాజాబాబు నాయక్, ఏ.కృష్ణమూర్తి, శివప్రసాద్, చిన్నయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ఆదివాసీలు ప్రకృతి ప్రేమికులు : ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్: ఆదివాసీలు ప్రాచీన చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దమని, వారు ప్రకృతి ప్రేమికులని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో గిరిజనులు మూడున్నర లక్షల వరకు ఉన్నారన్నారు. ఆదివాసీల అరకు కాఫీ ప్యారిస్ మార్కెట్‌లో మంచి ప్రజాదరణ పొందిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1995లో గిరిజనుల కోసం చైతన్య కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని తుంగలో తొక్కిందన్నారు. చైతన్య పథకాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

● టి.నరసాపురం: నాయకపోడు కులస్తులకు ఐటీడీఏ ద్వారా అన్ని పథకాలు అందించాలని ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా అధ్యక్షులు నారం రాజా, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పిరెడ్డి రాము, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిన లక్ష్మినారాయణ అన్నారు. కొల్లివారిగూడెంలో నారం రాజా ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొమరం భీం, మద్ది రాంచందర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకపోడుల హక్కుల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కేసర వెంకటేశ్వరరావు, సోమిన బుచ్చిరాజు, బేతం హనుమంతురావు, పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, ఎస్.బాలరాజు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: మండల కేంద్రంలో ఆదివాసీ జెండా ఎగరవేసి ఆదివాసీ నాయకులకు నివాళులర్పించారు. ఆదివాసీ సంఘాలన్ని సమన్వయంతో ఆదివాసీల అభ్యున్నతికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జాతి కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం కుక్కునూరులో ఆదివాసీ బాలికలు, యువతులు నృత్యం చేశారు. ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు కూరం సంజీవరావు, కీసరబజారు, పరమేశ్వరరావు, నాగార్జున, రఘుబాబు, రాము, వేణుగోపాల్, కూరం సీతారామయ్య, వందనం ధర్మరాజు, పాపారావు, ములిశెట్టి నాగేశ్వరరావు, వాడపల్లి లక్ష్మణాచార్యులు, ఎం.యుగంధర్‌లు, తదితరులు పాల్గొన్నారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి, కొండే లక్ష్మయ్య, కె.బాబురావు, నాగేష్, మారయ్య, రాము పాల్గొన్నారు.

● వేలేరుపాడు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పతాకావిష్కరణ చేసి సంబరాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ప్రజాపంథా అనుబంధ గిరిజన సంఘాలు, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివాసీ హక్కులపై మాట్లాడారు. గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

● ఏలూరు కార్పొరేషన్: రైతు కూలీ సంఘం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నగరంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. నగరంలో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలతో హోరెత్తించారు. అడవులను, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్న సామ్రాజ్యవాద కార్పొరేట్ శక్తులను దేశం నుంచి తరిమికొట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. కొండలు, అడవులను పాడు చేయవద్దని, పర్యావరణాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. గిరిజన సంక్షేమ చట్టాలన్నింటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. షేక్ బాషా, వి.శ్రీనివాసరావు, వి.గౌరి, రామారావు, మడిగిరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఐజీ హరికృష్ణ


శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న ఐజీ

ద్వారకాతిరుమల, ఆగస్టు 9: చినవెంకన్న ఆలయాన్ని అమరావతి డీజీపీ కార్యాలయ ఐజీ (పర్సనల్స్) హరికృష్ణ శుక్రవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ముఖమండపంలో ఆయనకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

## పీఎఫ్ ఖాతాల వివరాలు ఇవ్వాలి : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 9: జడ్పీ ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల వివరాలను ఈ నెల 31లోగా ఇవ్వకుంటే ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర తెలిపారు. వారు శుక్రవారం జడ్పీ సీఈవోను కలుసుకుని టీచర్లు జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో నగదు నిల్వ తెలియక ఆందోళనకు గురవుతున్నారని, జీతభత్యాల నుంచి మినహాయిస్తున్న సొమ్ము పీఎఫ్ ఖాతాలకు జమ అవుతుందో, లేదో సందిగ్ధత ఉందన్నారు. పలుమార్లు సీఈవోను కలిసి అభ్యర్థించినప్పటికీ ఇంతవరకు పరిష్కారం కాలేదన్నారు.

## వక్ఫ్‌బోర్డు చట్టం దారుణం

ఏలూరు రూరల్, ఆగస్టు 9: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లు రాజ్యాంగం కల్పించిన మత హక్కుకు వ్యతిరేకంగా ఉందని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా నాయకులు మస్తాన్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్‌బోర్డు నామినేటెడ్ బోర్డు కాబోతుందని, ఈ బిల్లు తీసుకురాకముందు ప్రభుత్వ భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు చేయలేదని విమర్శించారు. ఈ బిల్లు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని విమర్శించారు.

## ఎస్టీ వసతిగృహం పరిశీలించిన న్యాయాధికారి

చింతలపూడి, ఆగస్టు 9: మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఎస్టీ బాలుర వసతిగృహాన్ని న్యాయాధికారి సి.మధుబాబు శుక్రవారం పరిశీలించారు. భోజన వసతి, సదుపాయాలపై ఆరా తీశారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డాక్టర్ అనిల్ వైద్యసేవలందించగా, న్యాయవాదులు నాగేశ్వరరావు, సుందరరావు, డేవిడ్‌రాజు, సీడీపీవో మాధవి పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధి సాధించాలి : జడ్పీ సీఈవో

ఏలూరు టూటౌన్, ఆగస్టు 9: గ్రామ పంచాయతీలో సుస్థిర అభివృద్ధి సాధించడానికి స్థానిక సంస్థలు కృషి చేయాలని జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు. డీపీఆర్‌సీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల వంటి సమస్యలు పంచాయతీలే పరిష్కరించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో 21 వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. రిసోర్స్‌పర్సన్‌లు కృష్ణంరాజు, మజుద్దీన్, రామలక్ష్మి, పాండురంగారావు, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 9: హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించాలని డీఈవో అబ్రహం శుక్రవారం తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5 పాఠశాలలకు 29న పురస్కారాలు అందజేస్తారని వివరించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి 2023-24 సంవత్సరంలో జాతీయ, అంతర్‌జిల్లా, జిల్లాస్థాయి గ్రిగ్ పోటీలు, నియోజకవర్గ గ్రిగ్ ఆటల పోటీల్లో పతకాలను సాధించిన వారితోపాటు, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల నుంచి పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

## మాదకద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన

ఏలూరు అర్బన్, ఆగస్టు 9: పొగాకు, మాదకద్రవ్యాలు, మద్యం వినియోగం వల్ల దుష్పరిణామాలపై కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సర్వజన ప్రభుత్వాసుపత్రి మత్తు, మాదకద్రవ్యాల డీ-అడిక్షన్ సెంటర్ సైకాలజిస్టు వీర్రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలయ్యే యువత జీవితాలు దుర్భరం అన్నారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ మద్యం అనర్థాలు వివరించే రాయబారులుగా విద్యార్థులు వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అధ్యాపకులు విజయ్‌కుమార్, కృష్ణచైతన్య పద్మావతి, సిబ్బంది విజయ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## 14న సీఆర్ రెడ్డి కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 9: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలకు ఈనెల 14న సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు అధికారి సుధాకర్ శుక్రవారం తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్ ప్రోగ్రాంలో ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగాలు పొందడానికి ఉత్తమ అవకాశం అన్నారు. ఇంటర్మీడియట్ 75 శాతం కంటే ఎక్కువ మార్కులు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 9666322032లో సంప్రదించాలని సుధాకర్ తెలిపారు.

## 13న సెట్‌వెల్‌లో జాబ్‌మేళా

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 9 : సెట్‌వెల్ కార్యాలయం వద్ద ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనా అధికారి సి.మధుభూషణరావు శుక్రవారం తెలిపారు. 10వ తరగతి, ఆ పైన విద్యార్హత, 18-35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజు నాలుగు ఫొటోలుతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8886882032లో సంప్రదించాలని చెప్పారు.

## ఫార్మసీ ప్రతిభావంతులకు ప్రజ్ఞా పురస్కారాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 9: సీఆర్‌రెడ్డి ఫార్మసీ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జీపాట్, నైపర్, ఏపీ పీజీ ఈసెట్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 'ప్రజ్ఞ పురస్కార్-2024' ప్రకటించారని విద్యా సంస్థల కార్యదర్శి మాగంటి ప్రసాద్ తెలిపారు. గత విద్యాసంవత్సరంలో ఉద్యోగాలు పొందినవారు, ప్రతిభ పరీక్షల్లో ర్యాంకర్లకు శుక్రవారం కార్యక్రమంలో పురస్కారాలను, ప్రశంసాపత్రాలను బహుకరించారు.


యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

## యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 9: అఖిల భారత యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పలువురు నాయకులు కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, సేవాదళ్ రాష్ట్ర కోఆర్డినేటర్ కమ్ముల కృష్ణ, కొల్లి రామ్‌సూరిరెడ్డి, అన్నవాసుల ప్రవీణ్‌కుమార్, బొంతిని రామ్‌సింగ్, భట్టు పవన్, భట్టు శ్రీకాంత్, గొల్ల పవన్, సాయి నాగబాబు, ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, కొమ్మన సాంబశివరావు, రామసూరి, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు ప్రోత్సహించవద్దు

చింతలపూడి, ఆగస్టు 9: బాల్య వివాహాలు ప్రోత్సహించవద్దని ఐసీడీఎస్ పీవో మాధవి అన్నారు. యర్రగుంటపల్లి హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు తమ హక్కులు తెలుసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు లీలాకుమారి, మరియమ్మ, కమలా బాయమ్మ, ఆర్.మరియమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం..

- **జంగారెడ్డిగూడెం :** లైసెన్స్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపరాదని డీఎస్పీ యు.రవిచంద్ర వాహనదారులకు సూచించారు. శుక్రవారం ద్విచక్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్సులు, హెల్మెట్లు లేని వారిపై కేసులు నమోదు చేసి అవగాహన కలిగించారు.
- ఏఎంసీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్ తెలిపారు.
- విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని, శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ కన్వీనర్ కంభం విజయరాజు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.
- **కామవరపుకోట :** గుంటుపల్లి పంచాయతీలోని కొల్లువారిగూడెం, కంఠమనేనివారిగూడెం, జీలకర్రగూడెం గ్రామాల్లో డ్రెయినేజీల్లో పూడికతీత పనులు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సర్పంచ్ గోరిక దాసు పంచాయతీలో తీర్మానం చేసి ఈ మేరకు పూడికతీత పనులను ప్రారంభించారు.
- సీపీఐ, ఏఐటీయుసి ఆధ్వర్యంలో శుక్రవారం కామవరపుకోటలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మోదీ అధికారంలో ఉంటే కార్పొరేట్ శక్తులకు ప్రతీరోజు పండుగేనన్నారు.
- **పెదవేగి :** అపరిష్కృతంగా ఉన్న బోనస్‌ను ఇవ్వాలని పేర్కొంటూ గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ కంపెనీ కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట ధర్నాకు దిగారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యాక్టరీ కార్మికులు బోనస్ ఇవ్వాలని నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు.
- **ఉంగుటూరు :** ఎంఈవోగా భాస్కర్‌ను నియమించారు. శుక్రవారం ఆయనకు డీవైఈవో రవీంద్ర భారతి, విశ్రాంత ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు స్వాగతం పలికి అభినందించారు.
- **కొయ్యలగూడెం :** గంగన్నగూడెం గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ గంజిమాల రామారావు అన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న తాగునీటి వాటర్‌ప్లాంటు పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యల లేకుండా కృషి చేస్తానని తెలిపారు.
- **ద్వారకాతిరుమల :** దొరసానిపాడులో శుక్రవారం జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. శ్మశాన వాటికలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పిచ్చిమొక్కలను తొలగించాలని ప్రజలు కోరారు. ఏపీవో కుదరదని చెప్పడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పనులు చేస్తామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.
- **భీమడోలు :** శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో గుండుగొలను పీహెచ్‌సీ వైద్యులు విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ రవికుమార్, వంగా నాగేశ్వరరావు, సింగ్, నాగరాజు, శశికాంత్, చంద్రకళ, మురళీకృష్ణ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


లింగపాలెం, భీమడోలు, కొయ్యలగూడెం మండలాల్లో పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

# వరిలో తెగుళ్ల వ్యాప్తిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, ఆగస్టు 9: వరిలో తెగుళ్ల వ్యాప్తి చెందకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ బి.నాగకుమార్ అన్నారు. యడవల్లిలో ఏవో కె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. నాగకుమార్ మాట్లాడుతూ రైతులు క్రమం తప్పకుండా చేలను పరిశీలించాలన్నారు. పురుగుమందులు, రసాయన ఎరువులు అవసరం మేరకు మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి షాఫియా పరిహీన్ సూచించారు. మండలంలో రైతులంతా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటను ఈ పంట ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు సుఖీభవ పథకం ఈ పంట ద్వారా లబ్ధిపొందవచ్చన్నారు. బ్యాంకులో వ్యవసాయ ఆధారిత రుణాలు, జీరో వడ్డీ పంట రుణాలు, ప్రభుత్వం సబ్సిడీపై అందించే ఎరువులు, విత్తనాలు పొందవచ్చన్నారు.

● కొయ్యలగూడెం: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని ఏవో చెన్నకేశవులు సూచించారు. మండలంలోని రాజవరంలో పొలంబడి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 30మంది రైతులను ఎంపిక చేశామని, వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా వారికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గణేశ్‌వర్మ, రైతులు పాల్గొన్నారు.

● భీమడోలు: వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏవో ఉషారాణి సూచించారు. దుద్దేపూడిలో పొలంబడి కార్యక్రమంలో రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. పురుగుమందుల వాడకం తగ్గించాలన్నారు. అధికారుల సిఫార్సు మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు. పురుగుమందులు వాడడం వల్ల మానవాళిపై పడే విష ప్రభావాలను రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు బ్యాలెట్ బాక్సు టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



లోపూడిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

## శ్రావణ శుక్రవారం పూజలు

ముసునూరు, ఆగస్టు 9: లోపూడి రామాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా సమరసత గ్రామ మహిళా కన్వీనర్ రాజేశ్వరి మాట్లాడుతూ ఈ సేవా ఫౌండేషన్ ద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటా ధర్మ ప్రచార కార్యాక్రమాన్ని చేస్తున్నామన్నారు. నూజివీడు సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ పరమేశ్వరరావు, అర్చకుడు కుమారస్వామి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగపంచమి



ముదినేపల్లి, ఆగస్టు 9 : నాగపంచమి సందర్భంగా శుక్రవారం ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు జరిపారు. దేవస్థానం వద్ద పుట్టలో పాలుపోసి, నాగ ప్రతిమలకు మహిళలు పూజలు చేశారు. ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సంధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. సింగరాయపాలెం బావాజీ మఠంలోని నాగేంద్రుడి ఆలయం, పెదగొన్నూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిగాయి.



నూజివీడు త్రివిధలో విద్యార్థుల పుస్తక పఠనం

## ఘనంగా పుస్తక ప్రేమికుల దినోత్సవం

నూజివీడు టౌన్, ఆగస్టు 9: జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవాన్ని నూజివీడులో ఘనంగా నిర్వహించారు. నూజివీడు త్రివిధ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే మధో సంపత్తి పెరుగుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో రెండో విడత కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, ఆగస్టు 9: ఆర్‌జీయుకేటీ పరిధిలో రెండో విడత జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు సంబంధించి 238 మందికి కాల్ లెటర్స్ పంపగా 134 మంది ప్రవేశాలు పొందారు. అదే విధంగా ఆర్‌కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి 518 మందిని పిలువగా 310 మంది ప్రవేశాలు పొందినట్టు అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు. మిగిలిన సీట్లకు త్వరలో మూడో దశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.

## చాట్రాయి తహసీల్దార్‌గా ప్రశాంతి



చాట్రాయి, ఆగస్టు 9: చాట్రాయి తహసీల్దార్‌గా డి. ప్రశాంతి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కోనసీమ జిల్లా కాట్రేనిపాడు నుంచి ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ తహసీల్దార్ పనిచేస్తున్న మక్సూద్ అలీ రాజమహేంద్రవరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రశాంతి మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజలకు సత్వర సేవలందేలా కృషి చేస్తానన్నారు.

## 7 పంచాయతీలకు కార్యదర్శుల నియామకం

ముదినేపల్లి, ఆగస్టు 9 : ముదినేపల్లి మండలంలోని ఏడు పంచాయతీలకు కార్యదర్శులు నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ వెట్రి సెల్వి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని వడాలి పంచాయతీ కార్యదర్శిగా ఆగిరిపల్లి మండలం నరసింగపాలెం నుంచి కె.సంగమయ్య, శ్రీహరిపురం కార్యదర్శిగా కామవరపుకోట మండలం ఉప్పలపాడు నుంచి వై.వెంకట అప్పారావు, వణుదుర్రు కార్యదర్శిగా దెందులూరు మండలం సోమవరప్పాడు నుంచి ఎం.శ్రీకాంత్, పెదగొన్నూరుకు కొయ్యలగూడెం మండలం పరింపూడి నుంచి ఎం.రాధ, వాడవల్లి కార్యదర్శిగా కొయ్యలగూడెం మండలం కన్నాపురం నుంచి కోడె రుక్మిణి, చేవూరుకు తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం నుంచి టీవీ కృష్ణారెడ్డి, కోడూరు పంచాయతీ కార్యదర్శిగా దెందులూరు పంచాయతీ నుంచి డి.షైనిజ నియమితులయ్యారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, ఆగస్టు 9: సబ్‌స్టేషన్లో నూతన పరికరాలను ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రామకృష్ణ తెలిపారు. శనివారం నూజివీడు మండలం పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 31 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు

నూజివీడుటౌన్, ఆగస్టు 9: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జ్వరాల నివారణ చర్యల్లో భాగంగా నెలాకరు వరకు ప్రతి సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ నరేంద్ర కృష్ణ చెప్పారు. కోనేరుపేట యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వార్డు సచివాలయ అధికారుల సమన్వయంతో దోమల నివారణ, పారిశుధ్య కార్యక్రమాల మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. సర్వే ద్వారా జ్వర పీడితులను గుర్తించి చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సబ్ యూనిట్ అధికారి ఎం. యలమంద, నియోజకవర్గ పరిధిలోని హెల్త్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

## అగ్నిప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి, ఆగస్టు 9: షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ తదితర అగ్నిప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు ఫైర్ ఆఫీసర్ మత్తయ్య అన్నారు. తోటపల్లి హీల్ ప్యారడైజ్ సెకండరీ స్కూల్, జూనియర్ కాలేజ్ విద్యార్థులకు ఫైర్ సేఫ్టీ టెక్నిక్స్‌పై మాక్‌డ్రిల్ నిర్వహించి మాట్లాడారు. ఇంధనం వలన జరిగే అన్ని ప్రమాదాలకు ఫోమ్ ద్వారా నియంత్రిస్తారని, మిగిలిన అగ్ని ప్రమాదాలలో నీటి ద్వారా, కార్బన్ డైయాక్సైడ్ యంత్రాల ద్వారా చిన్నచిన్న మెలకువల ద్వారా నిలువరించవచ్చని తెలిపారు. అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టుమన్‌కు పదవీ విరమణ సత్కారం



చాట్రాయి, ఆగస్టు 9: మండలంలోని పోలవరం పోస్టుమన్‌గా 40 ఏళ్ళ పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన పాపన శ్రీరామమూర్తికి పోస్టల్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. చనుబండ సబ్ పోస్టాఫీస్‌లో శుక్రవారం రిటైర్డు పోస్టుమన్ పాపన శ్రీరామమూర్తి దంపతులను సబ్ పోస్టుమాస్టర్ రామచంద్రరావు, నూజివీడు తపాలా ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డి. మంగయ్య తదితరులు సత్కరించారు. లింగోజు శ్రీనివాసరావు, భాస్కరరావు, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

## కిటకిటలాడిన శ్రీశ్యామలాంబ ఆలయం



కైకలూరు, ఆగస్టు 9: శ్రావణ మాసోత్సవాల సందర్భంగా కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయం భక్తులతో పోటెత్తింది. మొదటి శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి పుష్పాలంకరణకు పులపర్రు గ్రామానికి చెందిన పూల ఆదినారాయణ సహకారమందించగా ఉచిత ప్రసాదాన్ని పూల ఆదినారాయణ, అమిరపు వెంకట సూర్య అప్పారావు, సుబ్బారావు, ఇందుకూరి వెంకట రామరాజు, ముదనూరి పవన్‌కుమార్, కొత్త నాగవెంకట మురళీకృష్ణ అందజేశారు. శ్రీశ్యామలాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో వీఎస్‌కె శేఖర్ ఏర్పాట్లు నిర్వహించారు.

## రేపు ఒంగోలు తరలిరండి

ముదినేపల్లి, ఆగస్టు 9 : ఒంగోలులో ఈ నెల 11న జరుగనున్న జాతీయ గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ రాష్ట్రస్థాయి సమావేశానికి దళితులు, బలహీన వర్గాలు పార్టీలకతీతంగా తరలిరావాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు కోరారు. ముదినేపల్లిలోని దళిత సంఘాల కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ రక్త సంబంధీకుడైన యశ్వంత్ పాల్గొంటున్న ఈ సమావేశాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత దళితులపై ఉందన్నారు. పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయాలన్నారు.

## క్రైం సమాచారం

### భార్యను చెరువులో ముంచి కడతేర్చాడు..?



అనంతలక్ష్మి మృతదేహం

కలిదిండి, ఆగస్టు 9 : భార్యను చెరువులో ముంచి హత్యచేశాడంటూ హతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సానారుద్రవరం గ్రామంలో పుప్పాల నాగరాజు కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి భార్య అనంతలక్ష్మి (33) భర్తను కూలి పనికి సక్రమంగా వెళ్లటం లేదు.. పిల్లలను ఎలా పోషించాలని నిలదీయటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన నాగరాజు అనంతలక్ష్మిని కొట్టడంతో ఆమె ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన భార్యను ఇంటి సమీపంలో ఉన్న పంచాయతీ చెరువులో ముంచి హత్య చేశాడు. మృతురాలి తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కైకలూరు సీఐ కృష్ణకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లక్ష్మీభవాని ఆచూకీ కోసం గాలింపు

**అనుమానాలు రేకెత్తిస్తున్న ఉత్తరం**

ముదినేపల్లి, ఆగస్టు 9: ముదినే పల్లిలో గురువారం అదృశ్యమైన కోన మహాలక్ష్మి భవాని (32) అనే వివాహిత ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. తన భర్తతో మనస్పర్థల కారణంగా లక్ష్మీభవాని ఇంటి నుంచి వెళ్లిపోయింది. పోలీసులు ముదినేపల్లిలో సీసీ ఫుటేజ్‌లు పరిశీలించగా, ఆమె పోలీస్ స్టేషన్ పక్క నుంచి ఆర్టీసీ బస్ స్టేషన్‌లోకి వెళ్లి విజయవాడ బస్ ఎక్కినట్టు తెలుసుకున్నారు. వెంటనే ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విజయవాడ ఆర్టీసీ బస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడి సీసీ ఫుటేజ్‌లను పరిశీలించగా, గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు బస్ స్టేషన్‌లో ఉన్నట్టు గుర్తించారు. దీంతో పోలీసులు విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ పరిసరాల్లో లక్ష్మీ భవాని ఆచూకీ కోసం యత్నిస్తున్నారు. బస్ స్టేషన్ నుంచి ఆమె ఎక్కడికి వెళ్లిందనేది ఆరా తీస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**అనుమానాలు రేకెత్తిస్తున్న ఉత్తరం**

ఇంటి నుంచి వెళ్లిపోయే ముందు లక్ష్మీభవానీ ఒక లెటర్ రాసి ఇంటిలో పెట్టింది. లెటర్ సారాంశం చూస్తే ఆమె జీవితంపై విరక్తి చెందినట్లు అర్థమవుతోంది. ఏడేళ్ల కుమార్తె ధన్విని జాగ్రత్తగా చూసుకుంటూ విద్యా బుద్ధులు నేర్పించాలని తన తల్లి లక్ష్మిని ఉద్దేశించి లక్ష్మీభవాని ఆ లెటర్‌లో రాసింది. కుమార్తె ధన్విని ఉద్దేశించి కూడ బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకో అమ్మా అంటూ రాసింది. తాను జీవితంపై విరక్తి చెంది వెళ్లిపోతున్నానని స్పష్టంగా పేర్కొంది.

**దర్యాప్తులో తేలిన అంశాలు**

పోలీసుల దర్యాప్తులో కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చాయి. 2015లో నెల్లూరుకు చెందిన కోన నాగార్జునతో లక్ష్మీభవానికి వివాహమైంది. నాగార్జున అప్పట్లో బెంగళూరులో ఉద్యోగం చేసేవాడు. కొంతకాలం తర్వాత ఉద్యోగం మానేసి ముదినేపల్లి వచ్చి రొయ్యల చెరువులు సాగు చేసి అప్పుల పాలయ్యాడు. భార్య లక్ష్మీభవాని పేరిట అప్పులు చేశాడు. అప్పు తీర్చాలని ఒత్తిళ్లు పెరిగాయి. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు పెరిగిన నేపథ్యంలో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది.

# సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తేవాలి



ముసునూరు సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, సర్పంచ్‌లు

కైకలూరు, ఆగస్టు 9: గ్రామాల్లో చెత్తసంపద తయారీ కేంద్రాలను సెప్టెంబరు 1వ తేదీ నాటికి వినియోగంలోకి తేవాలని ఎంపీడీవో ఎస్. ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజూ తడిచెత్త, పొడిచెత్త వేరువేరుగా సేకరించాలన్నారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేటపుడు ప్రధాన సమస్యలను గుర్తించి పరిగణలోకి తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, మండల, జడ్పీ నిధులతో చేసే అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలకు ఎల్‌ఈడీ లైట్లను వినియోగించాలని సూచించారు. ఈవోపీఆర్డీ రవిశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**ముసునూరు:** పంచాయతీల పాలనా విధానంపై ఎంపీడీవో సీహెచ్. పద్మావతీదేవి అధ్యక్షతన సర్పంచ్‌లు, కార్యదర్శులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాస రావు మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను పంచాయతీల అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికలను తయారు చేసుకుని, సమర్థవంతమైన పాలన కొనసాగించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో డ్రెయినేజీలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే ప్రతి రోజూ పారుశుధ్య పనులు చేపట్టాలని, ప్రజారోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వివరించారు. అనంతరం ముసునూరులో సంపద తయారీ కేంద్రాన్ని అధికారులు, సర్పంచ్‌లు పరిశీలించారు. వర్మి కంపోస్ట్ తయారీపై సర్పంచ్‌లకు ఎంపీడీవో అవగాహన కల్పించారు. ఎంపీపీ దుర్గాభవాని. సూపరింటెండెంట్ కె.సాయి రామ్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

**కలిదిండి:** గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో దినతేజ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సంపద తయారీ కేంద్రాలు, వీధి లైట్లు, పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు చేసి కిలో రూ.10 చొప్పున రైతులకు విక్రయించాలన్నారు. వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీలో అభివృద్ధి పనులపై ప్రణాళిక రూపొం దించుకుని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈవోపీఆర్డీ రాఘవేంద్రరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఆదాయం ఆధారంగా పనుల ప్రణాళిక

**ముదినేపల్లి:** పంచాయతీల ఆదాయ వనరుల ఆధారంగా అభివృద్ధి పనుల కార్యాచరణ రూపొందించాలని ముదినేపల్లి మండల ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ కోరారు. ముదినేపల్లిలో శుక్రవారం మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విధులతోపాటు బాధ్యతలను నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీల్లో అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ఆదాయాన్ని బట్టి ప్రాధాన్య క్రమంలో పనులు నిర్వహించాలని సూచించారు. పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ, నిధుల వినియోగం, సంపద కేంద్రాలు తదితర అంశాలపై ఆయన శిక్షణ ఇచ్చారు.

## 52వ రోజుకు అన్న క్యాంటీన్.. దాతకు సత్కారం



కైకలూరు, ఆగస్టు 9: అన్నక్యాంటీన్‌లను సైతం మూసివేసి జగన్ ప్రభుత్వం పేదలకు తీరని ద్రోహం చేసిందని మాజీ వైస్ ఎంపీపీ రహీం, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ రాజు అన్నారు. శుక్రవారం కైకలూరులో అన్నక్యాంటీన్‌ను 52వ రోజు ఆటపాకకు చెందిన టీడీపీ నాయకుడు వేల్పూరి చంద్రమోహన్ అతని కుమారుడు విష్ణువర్ధన్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పేదలకు ఉచితంగా భోజనాన్ని అందించారు. కూటమి నాయకులు వీరాబత్తిన సుధా, కంచర్ల రామకృష్ణ, అద్దంకి రమేష్‌రాజు, ఆటపాక ఉపసర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, కొడమల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

మండవల్లి ఆగస్టు 9 : బీజేపీ మండవల్లి మండల కార్యవర్గ సమావేశం మండవల్లిలో సాయిబాబా ఆలయం వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు సమయం ఏసుబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజల్లో జాతీయ స్ఫూర్తి పెంచేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం, ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ చేరేలా కార్యకర్తలు చొరవ చూపాలని, ప్రజా సమస్యలపై స్పందించాలన్నారు. మండల ఇన్‌చార్జి శ్యామలరాజ్ గౌడ్, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, బండి రంగారావు, బోను ఈశ్వరరావు, కూనపురెడ్డి శ్రీనివాసరావు, పేరం భార్గవ్, బండి దివాకర్, మునగాల రమేష్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్‌ఎంసీల్లో మహిళలకే అగ్రస్థానం

ముదినేపల్లి, ఆగస్టు 9 : పాఠశాలల నిర్వహణ కమిటీల్లో సభ్యులతోపాటు చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడంలో మహిళలే అగ్రస్థానంలో నిలిచారు. ముదినేపల్లి మండలంలో ఎస్‌ఎంసీల చైర్మన్ పదవులకు 67 శాతం, వైస్ చైర్మన్ పదవులకు 76 శాతం మహిళలు ఎన్నికయ్యారు. మండలంలో 67 పాఠశాలల కమిటీల్లో 44 కమిటీలకు మహిళలు, 23 కమిటీలకు పురుషులు చైర్మన్లుగా, వైస్ చైర్మన్లుగా 51 కమిటీలకు మహిళలు, 16 మంది పురుషులు ఎన్నికయ్యారు. చైర్మన్ పదవులు బీసీలకు 32, ఎస్సీలకు 23, ముస్లిం మైనార్టీలకు 1, ఎస్టీలకు 1, ఇతరులకు 10 దక్కాయి. వైస్ చైర్మన్ పదవులు ఎస్సీలకు 31, బీసీలకు 23, ఎస్టీలకు 5, ముస్లిం మైనార్టీలకు 2, ఇతరులకు 6 దక్కాయి. మండలంలో 99.7 శాతం పదవులకు మహిళలు ఏకగ్రీవమయ్యారు.

**హైస్కూళ్ల చైర్మన్లు వీరే...**

ముదినేపల్లి జడ్పీ హైస్కూలు ఎస్‌ఎంసీకి యు.గాలిబాబు, చిగురుకోటకు పి.వీరాంజనేయులు, బొమ్మినంపాడు అల్లాడ సత్యనారాయణ, అల్లూరు హైస్కూలుకు శీలం వెంకట శ్యామల, పెదగొన్నూరు గుడిసే లక్ష్మణరావు, గురజ యలక్కాయల వెంకటేశ్వరరావు, పెదపాలపర్రుకు బొప్పన నరసింహమూర్తి, వడాలి హైస్కూల్‌కు గుర్రం నాగ సుబ్రహ్మణ్యం చైర్మన్లుగా ఎన్నికయ్యారని ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు.

## ఎం-బుక్‌లు ఇవ్వమంటే పోయాయట!



వినతిపత్రం చూపుతున్న టీడీపీ నాయకులు

ముసునూరు, ఆగస్టు 9: చెక్కపల్లి పంచాయితీ పరిధిలో వేసిన సీసీ, గ్రావెల్ రోడ్లుకు సంబంధించిన ఎం-బుక్‌లను ఇప్పించాలని కాంట్రాక్టర్లు, టీడీపీ నాయ కులు కంచర్ల వెంకటేశ్వరరావు, కాటేపల్లి వెంకట శ్రీనివాసరావు, కంచర్ల సత్య నారాయణ, కంచర్ల రాజారావు శుక్రవారం ఎంపీడీవో పద్మావతిదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017-18 సంవత్సరంలో గ్రామంలో సీసీ, గ్రావెల్ రోడ్లు వేశామని, బిల్లుల నిమిత్తం ఎం-బుక్‌లను సంబంధిత అధికారులతో తయారు చేయడం జరిగిందన్నారు. అయితే ఆనాటి పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావుకు ఇచ్చామని, ప్రస్తుతం బిల్లులు చేయించుకుందామని ఎం-బుక్‌లను ఇవ్వమని కోరగా, అవి పోయాయని చెబుతున్నారని వారు వాపోయారు. గ్రామాభివృద్ధి కోసం అప్పు తెచ్చి మరీ అభివృద్ధి పనులు చేశామని, తీరా బిల్లులు చేయించుకోవాటానికి ఎం-బుక్‌లు లేని పరిస్థితి నెలకొందని, తక్షణమే దీనిపై విచారణ చేసి, కార్యదర్శి నుంచి ఎం-బుక్ లిప్పించాలని ఎంపీడీవోను కోరారు.

## సాగర్ నీరు వేంపాడు మేజర్‌కు ఇవ్వండి

ముసునూరు, ఆగస్టు 9: వేంపాడు మేజర్‌కు సాగర్ జలాలను విడుదల చేసి చెరువులను నింపాలని కోరుతూ చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం టీడీపీ నాయకులు శుక్రువారం నాగార్జునసాగర్ ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటీ సూపరింటెండెంట్ నాగేశ్వరరావుకు వినతపత్రం అందజేశారు. ముసునూరు మండలంలో వర్షపాతం తక్కువగా ఉన్నందున సాగు, తాగునీటి కోసం వేంపాడు మేజర్ కాలువ ద్వారా సాగర్ జలాలతో చెరువులను నింపాలని టీడీపీ నాయకులు కాటేపల్లి నాగేశ్వరరావు, కూచిపూడి దేవేంద్ర, మాదల వెంకటేశ్వరరావు, బర్మా శేషగిరిరావు, కంచర్ల నిరంజన్‌లు ఏఎస్‌ఈని కోరారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి దిగువకు వదిలిన నీటితో పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం ఇప్పటికే 12 టీఎంసీలకు చేరిందని, పూర్తిస్థాయి మట్టం 13కు చేరగానే సంబంధిత అధికారులతో చర్చించి, వేంపాడు మేజర్‌కు నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని ఏఎస్‌ఈ నాగేశ్వరరావు చెప్పినట్టు నాయకులు తెలిపారు.

## నల్ల చట్టాలు రద్దు చేయాలి

ముసునూరు, ఆగస్టు 9: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రమణక్కపేటలో సాగుదారులు, లిబరేషన్ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ దేశ సంపదను అదాని, అంబానీ లాంటి కార్పొరేట్లకు దోచి పెడుతున్న బీజేపీ ప్రభుత్వం, రైతులపై మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చి, వ్యవసాయ రంగాన్ని సైతం ప్రైవేటీకరణ చేసేందుకు యత్నిస్తోందన్నారు. అటవీ భూముల సాగుతో జీవిస్తున్న పేదలకు తక్షణమే పట్టాలు ఇవ్వాలన్నారు. ఉపాధి వేతన బకాయిలను విడుదల చేయాలన్నారు. లిబరేషన్ నాయకులు ఆముదాల చినబాబు, వేముల చంటి, నందిపాము రాణి, సాగుదారులు పాల్గొన్నారు.

## బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ముసునూరు. ఆగస్టు 9: సమాజంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలను ఎదుర్కోవాలంటే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్ భూలక్ష్మి అన్నారు. శుక్రవారం ముసునూరు గురుకుల బాలికలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు ప్రత్యేక చట్టాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ

చాట్రాయి, ఆగస్టు 9: ఆరుగొలనుపేటలో శ్రీలక్ష్మమ్మ, అంకమ్మ వార్ల ఆలయ పునఃప్రతిష్ఠ శుక్రవారం ఉదయం 9.36 గంటలకు వైభవంగా జరిగింది. అమ్మవార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ హైమవతి దంపతులు, టీడీపీ నాయకులు బొట్టు లక్ష్మణరావు, కందుల కృష్ణ పలు గ్రామాల నాయకులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.

## ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



ముసునూరు, ఆగస్టు 9: వేల్పుచర్లలో టీడీపీ వ్యవ స్థాప కుడు, మాజీ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శుక్రవా రం పార్టీ గ్రామ అధ్యక్షుడు మానం ఘంటేశ్వ రరావు, నాయకులు భూమిపూజ చేశారు. త్వరలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించేలా చర్యలు తీసుకుం టామని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని దలరాం, నాయకులు గద్దె రఘుబాబు, మానం రాంబాబు, తుమ్మల నాగేశ్వరరావు, అబ్బినేని రాంబాబు, ఆశోక్, రాజు నాని, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ముసునూరు, ఆగస్టు 9: ఉద్యాన పంటల సాగు రైతులు తమ పంటను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఉద్యానవన శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జె.శాంతి అన్నారు. శుక్రవారం ముసునూరు, చింతలవల్లి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఇన్‌చార్జ్ హెచ్‌వో ప్రియాంక జ్యోతి, వీహెచ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు రావాలి

చాట్రాయి, ఆగస్టు 9: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారి శివ శంకర్ సూచించారు. బూరుగ్గూడెంలో శుక్రవారం వరి రైతులకు పొలంబడి శిక్షణ నిర్వహించారు. నాణ్యమైన దిగుబడులు, సస్యరక్షణ, మిత్ర, శత్రు పురుగులు గుర్తించటం, రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించటం, విత్తనశుద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీఈవో కృష్ణారెడ్డి, రైతులు కేశవరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నారుమళ్లలో నీటి నిల్వలు తొలగించాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 9: భారీ వర్షాల నేపథ్యంలో నారుమళ్లలో నీటి నిల్వలు తొలగించి ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ చెప్పారు. ఒక గ్రాము కార్బండిజంను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, పిలకదశలో వరి మునిగితే పొటాష్ ఎరువులను ఎకరానికి 20 కిలోలు, యూరియా ఎకరానికి 20 కిలోలు వేసుకోవాలన్నారు. ఇక మొక్కజొన్న పైరు లేత దశలో ఉన్ననేపథ్యంలో ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను చల్లుకోవాలని ఆయన తెలిపారు.

# సరిదిద్దాకే 'సర్దుబాటు'

**స్థానభ్రంశానికి సీనియార్టీ ప్రామాణికతపై అభ్యంతరాలు**

**కొత్త జిల్లాల ప్రకారమే మండలాల్లో టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్**

**పరిశీలనకు 'మిగులు' టీచర్లు, వేకెన్సీల జాబితాలు**

ఏలూరు అర్బన్, ఆగస్టు 9 : సీనియార్టీ, పలువర్గాలకు మినహాయింపుల కోసం డిమాండ్లు వెల్లువెత్తడంతో వాటిని వీలైనంత మేర పరిష్కరించిన తర్వాతే టీచర్ల పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్)ను చేపట్టేందుకు వీలుగా వాయిదా వేశారు. పలు అంశాలపై వివరణలు అవసరమైనందున శుక్రవారం జరగాల్సిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు తాత్కాలికంగా నిలిపి వేయాలని అన్ని మండలాల ఎంఈవోలకు ఆదేశాలు జారీచేశారు. సోమవారం తర్వాతే ఈ మొత్తం ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి, మార్గదర్శకాల్లో కొన్ని సవరణల అనం తరమే మళ్లీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టే అవకాశాలున్నాయి. మరోవైపు కొత్త జిల్లాల ప్రాతిపదికన ఆయా మండలాల వారీగా సర్‌ప్లస్ టీచర్లు, డెఫిసిట్ పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా వేకెన్సీల వివరాలతో కూడిన జాబి తాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖకు పంపిన ఉన్నతాధికారులు సం బంధిత వివరాలను మరోదఫా పరిశీలిం చుకో వాలని సూచించింది. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్)లో కొందరు ఉద్యోగంలో చేరిన తేదీ తదితర అంశాల్లో తప్పులు నమోదు చేయడాన్ని గుర్తించి వాటిని సరిచేసి పంపా ల్సిందిగా జిల్లా అధికారులకు సూచించారు. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో సుమారు 370 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు (మున్సిపల్ 'మిగులు' మినహాయించి) సర్‌ప్లస్ జాబితాలో ఉండగా, 220 మందిని కొరతవున్న పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నిబంధనల మేరకు తాత్కాలిక సర్దుబాట్లు చేస్తారని తెలిసింది. భీమవరం కేంద్రంగా వున్న పశ్చిమగోదావరి జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ సర్‌ప్లస్ టీచర్లు, కొరత వున్న పాఠశాలల వివరాలను అక్కడి విద్యాధికారులకు పంపగా, స్థానికంగా ఉన్న అక్కడి మండలాల్లోనే సర్దుబాట్లు చేయాల్సి ఉంటుంది.

**ఈ అభ్యంతరాలపై సవరణలకు అవకాశం**

మండల స్థాయిలో సర్‌ప్లస్ టీచరును స్టేషన్ (ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల)సీనియార్టీ ప్రకారం ప్రామాణికంగా తీసుకుని అక్కడి జూని యర్‌ను కొరతవున్న పాఠశాలకు సర్దుబాటు చేయాలన్నది తొలుత జారీ చేసిన మార్గదర్శకంగా ఉంది.డివిజన్ స్థాయికి వచ్చేసరికి కేడర్ సీనియార్టీని ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా ఈ రెండూ ద్వంద్వ ప్రమాణాలని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాన్ని తెలి పాయి. గతేడాది మార్చిలో నిర్వహించిన సాధారణ బదిలీల్లో అయా పాఠ శాలలకు బదిలీని కోరుకున్న సీనియర్ టీచర్లుసైతం మండలస్థాయిలో ఇపుడు జూనియర్లు అయిపోతారని, ఆ ప్రకారం సీనియర్లను ఏడాదిన్నర లోగా మరో స్కూలుకు సర్‌ప్లస్ పేరిట పంపేయడం సహేతుకంగా లేదన్నది ప్రధాన అభ్యంతరంగా ఉంది. ఇటువంటి సీనియర్లలో గరిష్ఠంగా ఒకేస్కూలులో 8 ఏళ్ళ లాంగ్ స్టాండింగ్‌పై తప్పనిసరిగా బదిలీ అయిన ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. అయితే ప్రభుత్వ వాదన మరోలా ఉంది. సంబంధిత స్కూలులో గరిష్ఠ స్టేషన్ సీనియార్టీకి లోబడి పనిచేస్తున్న టీచర్లు పాఠశాల విద్యార్థులతో మమేకం అయి ఉండటంతో పాటు, స్కూలు అభివృద్ధికి కృషిచేసి ఉంటారని అందువల్ల అక్కడ జూనియర్‌ను కొరతవున్న చోటకు సర్దుబాటు చేయడం సహేతుకమేనని విద్యాశాఖ ఉన్నతాధికారులు సమర్థించు కుంటున్నారు. ఆ ప్రకారం మండల, డివిజన్ స్థాయి కౌన్సె లింగ్‌లకు కేడర్ సీనియార్టీనే ప్రామాణికంగా తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు పట్టు బడుతుండటంతో పీటముడి పడింది. ఇక నూరుశాతం దృష్టిలోపం వున్న టీచర్లకు మాత్రమే పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వడం సరికాదని, దీనిని 70 శాతానికి కుదించడంతో పాటు, శారీరక వైకల్యం, బైపాస్ శస్త్ర చికిత్స చేయించుకున్న టీచర్లనుకూడా వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి మినహాయించాల్సిందేనంటూ ఉపాధ్యాయ నాయకులు పట్టుబడుతుండటం కూడా ఓ ఆటంకంగా పరిణమించింది. ఇక సర్దుబాటుకు సాంకేతికంగా అవరోధాలు తలెత్తే మున్సిపల్ సర్‌ప్లస్ టీచర్ల విషయమై ఏంచేయాలో డైలమా నెలకొంది. వీటితో పాటు గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో 117 ఉత్తర్వుల ప్రకారం కాకుండా, వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం నూతన మార్గదర్శకాలు తీసుకు వచ్చేవరకు వాయిదా వేయాలని కోరుతున్నాయి. మరికొన్ని అభ్యంతరాలు కూడా ఉన్నందున వాటిలో కొన్నింటి నైనా పరిష్కరించి ఉపాధ్యాయులను సంతృప్తిపరిచిన తర్వాతే పని సర్దుబాటు చేపట్టేందుకు వీలుగా కొన్నిరోజులపాటు వాయిదా వేసినట్టు చెబుతున్నారు.